

# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | బుధవారం 31-12-2025 | సంపుటి - 26 | సంచిక -223 రూ : 4 | పేజీలు: 8




2లో

## అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఖరారు

- అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా హరీశ్ రావు, సబిత, తలసాని
- శాసనమండలి ఉపనేతలుగా ఎల్.రమణ
- మండలి విప్‌గా దేశపతి శ్రీనివాస్‌కు బాధ్యతలు
- అసెంబ్లీ శీతాకాల సమావేశాల వేళ కేసీఆర్ కీలక నిర్ణయం

## చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా

- ఆక్రమణలకు అద్దం పడుతున్న హైడ్రా విడుదల చేసిన శాటిలైట్ చిత్రాలు
- ఇనార్బిట్ మాల్ వైపు కబ్జా కోరల్లో చిక్కుకున్న 5 ఎకరాల స్థలం స్వాధీనం
- మట్టితో పూడ్చి పార్కింగ్ పేరుతో నెలకు రూ.50 లక్షల దందా చేసిన వైనం
- 160 ఎకరాల విస్తీర్ణంలోని చెరువు నేడు 116 ఎకరాలు

2లో






2లో

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

- దేశంలో 1.46 లక్షల కిలోమీటర్లకు చేరిన జాతీయ రహదారులు
- 2014తో పోలిస్తే ఎక్స్‌ప్రెస్ వే నిర్మాణాలలో భారీ వృద్ధి
- ప్రమాద బాధితులకు దేశవ్యాప్తంగా ఉచిత వైద్య సాయం అమలు
- క్షతగాత్రులను ఆదుకునే వారికి రూ.25 వేల రివార్డు పెంపు

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య...

- స్వెటర్స్ ఫ్యాక్టరీలో కాల్చి చంపిన తోటి ఉద్యోగి
- అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయిన బజేంద్ర

2లో





2లో

## తిరుమల తరహాలో గుట్ట ఆలయంలో ప్రత్యేక సేవలు

- గుట్ట క్షేత్రంలో భక్తుల కోసం పలు కొత్త సేవలు అందుబాటులోకి
- ప్రతి బుధవారం తోమాల సేవ
- సరికొత్తగా తులాభారం సేవ
- నేటి నుంచి ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ

## పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

- పుతిన్ నివాసంపై దాడి వార్తలు కలచివేసాయన్న మోదీ
- శాంతి చర్చలకు విఘాతం కలిగించే చర్యలు వద్దని హితవు
- 91 డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి చేసిందన్న రష్యా
- ట్రంప్ మధ్యవర్తిత్వంతో కొలిక్కి వస్తున్న శాంతి చర్చలు
- యుద్ధం ముగింపు దశకు చేరుకుందన్న అమెరికా అధ్యక్షుడు

2లో





2లో

## వైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాలు

- తిరుమల శ్రీవారిని కుటుంబ సమేతంగా వైకుంఠ ద్వార దర్శనం చేసుకున్న సీఎం రేవంత్ రెడ్డి
- శ్రీవారి దర్శనం అనంతరం సీఎంకి ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందించిన అర్చకులు

# చెరువు కబ్జా ఎలా జరిగిందో శాటిలైట్ చిత్రాలు విడుదల చేసిన హైడ్రా

హైదరాబాద్:చారిత్రక దుర్గం చెరువును కబ్జాదారులు ఎలా కబళించారో కళ్లకు కట్టే సాక్ష్యాలను హైడ్రా బయటపెట్టింది. ఒకప్పుడు 160 ఎకరాల విస్తీర్ణంతో అలరారిన ఈ చెరువు, నేడు 116 ఎకరాలకు ఎలా కుంచించుకుపోయిందో వివరిస్తూ 'నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్' సహకారంతో శాటిలైట్ చిత్రాలను విడుదల చేసింది. దశాబ్దాలుగా సాగిన ఈ ఆక్రమణల పర్వాన్ని ఈ చిత్రాలు స్పష్టంగా బట్టబయలు చేస్తున్నాయి. గోల్కొండ కోట నివాసులకు దాహార్తిని తీర్చిన ఈ 'సీక్రెట్ లేక్'.. నేడు కబ్జాల చెరలో చిక్కుకుంది. హైడ్రా విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. 1976 నాటికే దుర్గం చెరువులో 29 ఎకరాలు కబ్జాకు గురై 131.66 ఎకరాలకు తగ్గింది. ఆ తర్వాత 1995 వరకు సురక్షితంగా ఉన్నప్పటికీ, 1995 నుంచి 2000 మధ్య మరో 10 ఎకరాలు అన్యాక్రాంతమై 121 ఎకరాలకు పడిపోయింది. 2000 సంవత్సరం నుంచి నేటి వరకు మరో 5 ఎకరాలు కబ్జా కోరల్లోకి వెళ్లినట్లు శాటిలైట్ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. తాజాగా మాదాపూర్‌లోని ఇనార్బిట్ మాల్ వైపు దాదాపు 5 ఎకరాల మేర జరిగిన ఆక్రమణలను హైడ్రా మంగళవారం విజయవంతంగా తొలగించింది. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆదేశాలతో అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కబ్జాలను నిర్ధారించుకున్నారు. అక్కడ 10 నుంచి 15 మీటర్ల మేర మట్టిని చెరువులో డంప్ చేసి, ఆ స్థలాన్ని చదును చేసి భారీ పార్కింగ్ దందాను నడిపిస్తున్నారు. స్కూల్ బస్సులు, ఐటీ ఉద్యోగుల క్యాబ్‌ల పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని వాడుతూ, నెలకు దాదాపు రూ.50 లక్షల



వరకు అద్దెలు వసూలు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఓ ప్రజాప్రతినిధి అండదండలతోనే ఈ వ్యవహారం నడుస్తోందని, ఆక్రమిత స్థలం తనదేనంటూ సదరు ప్రజాప్రతినిధి క్లైమ్ చేస్తున్నట్లు సమాచారం. ఎలాంటి భూ రికార్డులు లేకుండానే ఏళ్ల తరబడి ఈ దందా సాగుతోంది. చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి కూడా ఈ ఆక్రమణలు అడ్డుగా మారాయి. మంగళవారం జరిగిన ఆపరేషన్‌లో హైడ్రా అధికారులు పార్కింగ్‌లోని వాహనాలను ఖాళీ చేయించి, ఆ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేశారు. త్వరలోనే డంప్ చేసిన మట్టిని కూడా తొలగించి చెరువు పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం సర్వే ఆఫ్ ఇండియా, రెవెన్యూ రికార్డుల ఆధారంగా చెరువు పూర్తి విస్తీర్ణాన్ని పక్కాగా తేల్చే పనిలో హైడ్రా నిమగ్నమైంది.

## అసెంబ్లీ, మండలి డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు ఖరారు

హైదరాబాద్: తెలంగాణ అసెంబ్లీ శీతాకాల సమావేశాలు జరుగుతున్న వేళ, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. అసెంబ్లీ మరియు శాసన మండలిలో పార్టీ తరపున వ్యవహరించాల్సిన డిప్యూటీ ఫ్లోర్ లీడర్లను ఖరారు చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా పార్టీ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు హరీశ్ రావు, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్‌లను కేసీఆర్ నియమించారు. అలాగే, శాసన మండలిలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్లుగా ఎల్. రమణ, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిలకు బాధ్యతలు అప్పగించారు. మండలిలో పార్టీ విప్‌గా దేశపతి శ్రీనివాస్‌ను ఎంపిక చేశారు. సోమవారం నుంచి అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో, ఉభయ సభల్లో పార్టీ వ్యూహాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు కేసీఆర్ ఈ నియామకాలు చేపట్టినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

## ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్‌గా భారత్

ఢిల్లీ: గత 11 ఏళ్లలో భారతదేశం మౌలిక సదుపాయాల కల్పనలో, ముఖ్యంగా జాతీయ రహదారుల విస్తరణలో సరికొత్త చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా జాతీయ రహదారుల పొడవు 1,46,560 కిలోమీటర్లకు చేరడంతో, అమెరికా తర్వాత ప్రపంచంలోనే రెండో అతిపెద్ద రోడ్ నెట్‌వర్క్ కలిగిన దేశంగా భారత్ అవతరించింది. 2014లో 91,287 కిలోమీటర్లుగా ఉన్న జాతీయ రహదారులు, 2025 నాటికి ఏకంగా 61 శాతం వృద్ధిని నమోదు చేసినట్లు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అగ్రరాజ్యం అమెరికా జాతీయ రహదారుల నెట్‌వర్క్ విషయంలో ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ముఖ్యంగా భారత్ మాల పరియోజన వంటి పథకాల ద్వారా భారత్ లో హైవేల రూపురేఖలు మారిపోయాయి. 2014లో కేవలం 93 కిలోమీటర్లుగా ఉన్న యాక్సెస్‌కంట్రోల్డ్ హైస్పీడ్ కారిడార్లు, ఎక్స్‌ప్రెస్ వేలు ప్రస్తుతం 3,052 కిలోమీటర్లకు పెరిగాయి. అలాగే నాలుగు లేన్ల రహదారులు 18 వేల కిలోమీటర్ల నుంచి 43,512 కిలోమీటర్లకు రెట్టింపయ్యాయి. రాబోయే మూడేళ్లలో మరో రూ.8.3 లక్షల కోట్ల విలువైన ప్రాజెక్టులను చేపట్టేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. సామాన్య ప్రజలకు ఊరటనిచ్చేలా భద్రతా ప్రమాణాల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. రోడ్డు ప్రమాద బాధితులకు 'క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ స్కీమ్' ద్వారా రూ.1.5 లక్షల వరకు ఉచిత వైద్య సాయం అందించేలా చర్యలు తీసుకున్నారు. అలాగే ప్రమాద సమయంలో సాయం చేసే వారికి (గుడ్ సమారిటన్) ఇచ్చే పారితోషికాన్ని రూ.5 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. రవాణా రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు 2026 జనవరిలో పబ్లిక్ ఇన్విట్ (InvIT)ను తీసుకురానున్నట్లు అధికారులు తెలిపారు. హైడ్రోజన్ ట్రక్కుల ప్రయోగాలు, ఫాస్టాగ్ ఆధారిత టోలింగ్ వంటి ఆధునిక సాంకేతికతతో భారత రవాణా రంగం కొత్త పుంతలు తొక్కుతోంది.

## బంగ్లాదేశ్‌లో మరో హిందువు హత్య...

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. ఒకటి తర్వాత ఒకటిగా హింసాత్మక ఘటనలు వెలుగులోకి వస్తుండటంతో అక్కడి పరిస్థితులపై అంతర్జాతీయంగా కూడా చర్చ మొదలైంది. దీపు చంద్ర దాస్, అమృత్ మండల్ హత్యల తర్వాత తాజాగా మరో హిందూ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మైమన్‌సింగ్ జిల్లాలో పనిచేస్తున్న 42 ఏళ్ల బజేంద్ర బిశ్వాస్‌ను అదే ఫ్యాక్టరీలో పని చేసే యువకుడు కాల్చి చంపిన ఘటన కలకలం రేపుతోంది. భాలుకా ఉపజిల్లాలోని లాబిబ్ గ్రూప్‌కు చెందిన సుల్తానా స్వెటర్స్ లిమిటెడ్ ఫ్యాక్టరీలో ఈ దారుణం చోటుచేసుకుంది. బజేంద్ర బిశ్వాస్ అక్కడ సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వర్తిస్తుండగా, నిందితుడిగా గుర్తించిన 22 ఏళ్ల నోమన్ మియాన్ కూడా అదే యూనిట్‌లో భద్రతా విధుల్లో ఉన్నాడు. బంగ్లాదేశ్ హోం మంత్రిత్వ శాఖ ఆధీనంలోని 'అన్సార్' విభాగంలో ఇద్దరూ పని చేస్తున్నారు. సంఘటన సమయంలో ఇద్దరూ మాట్లాడుకుంటుండగా, నోమన్ తన వద్ద ఉన్న ప్రభుత్వ తుపాకీని సరదాగా బజేంద్ర వైపు గురిపెట్టి అకస్మాత్తుగా కాల్చాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. ఈ ఘటనలో బజేంద్ర అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటన అనుకోకుండా జరిగిందా? లేక వెనుక మరేదైనా ఉద్దేశం ఉందా? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. అయితే వరుసగా జరుగుతున్న ఘటనల నేపథ్యంలో ఈ హత్యను సాధారణ ఘటనగా తీసుకోలేమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే జిల్లాలో ఇటీవల దీపు చంద్ర దాస్ అనే హిందూ యువకుడిని 'దైవదూషణ' ఆరోపణలతో మతోన్మాద మూక అత్యంత కిరాతకంగా హత్య చేసిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. అతడిని హత్య చేసి, నగ్నంగా శరీరాన్ని చెట్టుకు కట్టేసి తగలబెట్టిన దృశ్యాలు ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ తర్వాత రాజ్‌బరి జిల్లాలో అమృత్ మండల్ అనే మరో హిందూ వ్యక్తిని గ్రామస్తులు మూకగా దాడి చేసి చంపిన ఘటన మరింత ఉద్రిక్తతకు దారి తీసింది. ఈ వరుస హత్యలతో బంగ్లాదేశ్‌లో మైనారిటీల భద్రతపై పెద్ద ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అక్కడి ప్రభుత్వం పరిస్థితిని ఎలా అదుపులోకి తీసుకుంటుందో, ఇలాంటి ఘటనలను అరికట్టేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటుందో అన్నదానిపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది.

## వైష్ణవ ఆలయాల్లో ప్రారంభమైన వైకుంఠ ఉత్తర ద్వార దర్శనాలు

తెలుగు రాష్ట్రాలతో పాటు దేశవ్యాప్తంగా ఉన్న వైష్ణవ ఆలయాలు వైకుంఠ ఏకాదశి శోభతో వెలిగిపోతున్నాయి. భక్తులు వేకువజామున 2 గంటల నుంచే ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలకు తరలివచ్చారు. తిరుమల శ్రీవారి ఆలయంలో సోమవారం అర్ధరాత్రి 1.30 గంటల నుంచి వైకుంఠ ద్వార దర్శనాలు ప్రారంభమయ్యాయి. మొదట వీఐపీలకు వైకుంఠ ద్వారం గుండా శ్రీవారి దర్శనం కల్పించగా, సాధారణ భక్తులకు ఉదయం 6 గంటల నుంచి దర్శనానికి అనుమతించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి కుటుంబసభ్యులతో కలిసి వేకువజామునే శ్రీవారిని దర్శించుకున్నారు. సోమవారం రాత్రే తిరుమలకు చేరుకున్న ముఖ్యమంత్రి కుటుంబానికి ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా స్వాగతం పలికారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు సీఎంకు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు ఆశీర్వచనం చేసి సీఎం కుటుంబానికి తీర్థప్రసాదాలు అందజేశారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా తిరుమల గిరులు, ఆలయ ప్రాంగణం గోవింద నామస్మరణతో మారుమోగుతున్నాయి.

## తిరుమల తరహాలో గుట్ట ఆలయంలో ప్రత్యేక సేవలు

యాదగిరిగుట్ట: తెలంగాణలో ప్రఖ్యాత పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలోనూ తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) తరహాలో ఆర్జిత సేవలను ప్రారంభించేందుకు అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ సేవలలో కొన్నిటిని వైకుంఠ ఏకాదశి నుంచి, మిగతా వాటిని ఫిబ్రవరి నెల నుంచి దశలవారీగా భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు భావిస్తున్నారు. కొత్తగా ప్రవేశపెట్టనున్న సేవల్లో భాగంగా ముందుగా తోమాల సేవను ప్రారంభించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ సేవ ప్రతి బుధవారం ఉదయం 6.15 నుంచి 6.45 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతులు కలిసి పాల్గొనే ఈ సేవకు టికెట్ ధరను రూ.500గా నిర్ణయించారు. భక్తులు స్వామివారికి తోమాల సమర్పించి ప్రత్యేక ఆశీర్వాదాలు పొందే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు ఉన్న విధానానికి భిన్నంగా తులాభారం సేవను సరికొత్తగా రూపొందించారు. ఈ సేవలో అవసరమైన నాణేలు, బెల్లం వంటి వస్తువులను ఆలయ అధికారులు స్వయంగా అందుబాటులో ఉంచనున్నారు. దీంతో భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా తులాభారం నిర్వహించుకునే అవకాశం కలగనుంది. వైకుంఠ ఏకాదశి తర్వాత ప్రతిరోజూ సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవను ప్రారంభించనున్నారు. ఈ సేవకు టికెట్ ధర రూ.500గా నిర్ణయించగా, ఇందులో పాల్గొన్న భక్తులకు రెండు లడ్డూ ప్రసాదాలను ఉచితంగా అందజేయనున్నారు. ఇక ఇప్పటివరకు రథసప్తమి రోజుకే పరిమితమైన సూర్యప్రభ వాహన సేవను ఇకపై ప్రతి ఆదివారం ఉదయం 7.00 నుంచి 7.30 గంటల వరకు నిర్వహించనున్నారు. దంపతుల కోసం ఈ సేవ టికెట్ ధరను రూ.1,000గా నిర్ణయించారు. ఈ సేవలో పాల్గొనే భక్తులకు ఒక శాలువా, కనుమను ప్రసాదంగా అందజేస్తారు. అలాగే ఆలయ చరిత్రలో తొలిసారిగా చంద్రప్రభ వాహన సేవను కూడా ప్రారంభించనున్నారు.



## గగనతలంపై సుదర్శన చక్రం..
## శత్రువుల డ్రోన్లు, మిసైళ్లను నిర్వీర్యం చేయడమే లక్ష్యం

ఢిల్లీ, డిసెంబర్ 3 :దేశ రాజధాని ఢిల్లీ గగనతల భద్రతను మరింత బలోపేతం చేయడంపై కేంద్ర ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ఢిల్లీలోని అత్యంత సున్నితమైన వీఐపీ 89 జోన్ పరిధిలో గగనతల రక్షణను కట్టుదిట్టం చేసేందుకు దేశీయంగా అభివృద్ధి చేసిన ఇంటిగ్రేటెడ్ ఎయిర్ డిఫెన్స్ వెపన్ సిస్టమ్స్ కొనుగోలుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియా ఈ విషయాన్ని వెల్లడించింది. ఈ గగనతల రక్షణ వ్యవస్థను 'సుదర్శన చక్ర – ఫర్ ఢిల్లీ' అనే ఫ్రేమ్‌వర్క్‌లో భాగంగా పైలట్ ప్రాజెక్ట్‌గా అమలు చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్ ద్వారా దేశ రాజధాని చుట్టూ సుమారు 30 కిలోమీటర్ల పరిధిలో ఎటువంటి గగనతల ముప్పు ఎదురైనా వెంటనే గుర్తించి, అడ్డుకునే సామర్థ్యం ఈ వ్యవస్థకు ఉంటుంది. డ్రోన్లు, మిసైళ్లు, శత్రు యుద్ధవిమానాల నుంచి వచ్చే ప్రమాదాలను ముందే గుర్తించి నిర్వీర్యం చేయడమే దీని ప్రధాన లక్ష్యం. ఈ అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను డీఆర్‌డీవో స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసింది. దీని అంచనా వ్యయం సుమారు రూ.5,181 కోట్లుగా పేర్కొంటున్నారు. ఇటీవల కాలంలో డ్రోన్ల ద్వారా దాడులు, గగనతల ముప్పులు పెరుగుతున్న నేపథ్యంలో దేశ రాజధాని భద్రతపై కేంద్రం ప్రత్యేక దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, భారత సైనిక సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణ మంత్రిత్వశాఖ తాజాగా రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధ సామగ్రి కొనుగోళ్లకు ఆమోదం తెలిపింది. ఈ పెద్ద ప్యాకేజీలో భాగంగానే ఢిల్లీకి సంబంధించిన ఈ గగనతల రక్షణ వ్యవస్థకు కూడా అంగీకారం తెలిపినట్లు సమాచారం. గమనించాల్సిన విషయం ఏమిటంటే, ఈ ఏడాది స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలోనే ప్రధాని నరేంద్ర మోదీ 'సుదర్శన చక్ర' వ్యవస్థ గురించి ప్రస్తావించారు.

### పుతిన్ నివాసంపై డ్రోన్ దాడి...
## తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన ప్రధాని మోదీ

రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ నివాసం లక్ష్యంగా జరిగిన డ్రోన్ దాడుల పట్ల భారత ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా స్పందిస్తూ.. ప్రస్తుతం జరుగుతున్న దౌత్యపరమైన చర్చలే యుద్ధాన్ని ముగించి, శాంతిని స్థాపించడానికి సరైన మార్గమని స్పష్టం చేశారు. పుతిన్ నివాసంపై దాడి జరిగిందన్న వార్తలు తనను కలచివేశాయని, ఇలాంటి సమయంలో శాంతి చర్చల ప్రక్రియకు విఘాతం కలిగించేలా ఏ పక్షం కూడా వ్యవహరించకూడదని మోదీ సూచించారు. అందరూ చర్చలపైనే దృష్టి సారించాలని ఆయన కోరారు. రాత్రి వేళ, పుతిన్ ఉంటున్న నొవొగొరోడ్ ప్రాంతంపై ఉక్రెయిన్ 91 లాంగ్ రేంజ్ డ్రోన్లతో విరుచుకుపడిందని రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ ఆరోపించారు. దీనిని ఉగ్రవాద చర్యగా ఆయన అభివర్ణించారు. అయితే రష్యా వైమానిక రక్షణ వ్యవస్థలు వాటన్నింటినీ కూల్చివేశాయని, ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం జరగలేదని 'టాస్' వార్తా సంస్థ వెల్లడించింది. ఉక్రెయిన్ దాడికి రష్యా తగిన సమాధానం చెబుతుందని లావ్రోవ్ హెచ్చరించారు. మరోవైపు రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆయన ఆదివారం పుతిన్‌తో ఫోన్‌లో మాట్లాడగా, ఫ్లోరిడాలోని తన నివాసంలో ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్స్కీతో భేటీ అయ్యారు. ఈ చర్చలు చాలా సానుకూలంగా సాగాయని, యుద్ధం ముగింపు దశకు చాలా దగ్గరగా ఉందని ట్రంప్ వెల్లడించారు. ఇలాంటి కీలక సమయంలో దాడులు జరగడం అంతర్జాతీయంగా ఆందోళన రేకెత్తిస్తోంది.

## భారీగా ఆయుధాలు కొనుగోలు చేయనున్న భారత్

త్రివిధ దళాలకు సంబంధించిన సుమారు రూ.79 వేల కోట్ల విలువైన ఆయుధాలు, పరికరాల కొనుగోలు ప్రతిపాదనలకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సోమవారం జరిగిన రక్షణ సముపార్జన మండలి (డీఏసీ) సమావేశంలో ఈ మేరకు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ ఒప్పందం ప్రకారం సైన్యానికి పలు కీలక ఆయుధ వ్యవస్థలు అందుబాటులోకి రానున్నాయి. శత్రు లక్ష్యాలపై అత్యంత కచ్చితమైన దాడులు చేయగల లోయిటర్ మునిషన్ వ్యవస్థను సైన్యం పొందనుంది. అలాగే తక్కువ ఎత్తులో, చిన్న పరిమాణంలో ప్రయాణించే శత్రు డ్రోన్‌లు, యూఏవీలను గుర్తించి ట్రాక్ చేసే తేలికపాటి లో లెవల్ రాడార్లను కూడా సమకూర్చనున్నారు. దీంతో యాంటీ డ్రోన్ రక్షణ మరింత బలపడనుందని రక్షణ వర్గాలు పేర్కొంటున్నాయి. నేవీకి సంబంధించిన ప్రతిపాదనలకూ డీఏసీ ఆమోదం తెలిపింది. ఈ ఒప్పందం కింద బొల్లార్డ్ పుల్ (బీపీ) టగ్‌లను నేవీకి అందించనున్నారు. ఇవి ఓడరేవుల్లో నావిగేషన్ సమయంలో, పరిమిత ప్రదేశాల్లో నౌకలు, జలాంతర్గాములను సురక్షితంగా నడిపించేందుకు సహాయపడతాయి. అదేవిధంగా హైఫ్రీక్వెన్సీ సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ రేడియో (హెచ్‌ఎఫ్ ఎస్‌డీఆర్) ద్వారా బోర్డింగ్, ల్యాండింగ్ కార్యకలాపాల సమయంలో సురక్షితమైన, దీర్ఘశ్రేణి కమ్యూనికేషన్ సామర్థ్యం మరింత మెరుగుపడనుంది. వైమానిక దళానికి ఈ ఒప్పందం ప్రత్యేకంగా ప్రయోజనం చేకూర్చనుంది. అన్ని వాతావరణ పరిస్థితుల్లో టేకాఫ్, ల్యాండింగ్‌లను హైడెఫినిషన్‌లో రికార్డ్ చేసే ఆటోమేటిక్ టేకాఫ్, ల్యాండింగ్ రికార్డింగ్ వ్యవస్థను వైమానిక దళం పొందనుంది. దీంతో విమాన భద్రత మరింత బలపడనుంది. అలాగే సుదూర శ్రేణిలో శత్రు విమానాలను గగనతలంలోనే కూల్చివేయగల అస్త్రా ఎంకె 2 క్షిపణిని కూడా వైమానిక దళంలోకి చేర్చనున్నారు. అదనంగా స్పైస్ (ఎస్‌పైసీఇ1000) మార్గదర్శక కిట్‌ను అందించడంతో లక్ష్యాలపై కచ్చితమైన దాడుల సామర్థ్యం పెరుగుతుందని రక్షణ వర్గాలు పేర్కొన్నాయి.

## వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



శేరిలింగంపల్లి, (ప్రజాస్ఫూర్తి) : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా అల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని తులసీవనంలోని , కూకట్ పల్లి హౌసింగ్ బోర్డు లోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయాలలో వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ఆ వైకుంఠ వాసుడి ఆశీస్సులు మనందరిపైన ఉండాలని కోరుకుంటూ, ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి పర్వదిన శుభాకాంక్షలు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ ప్రసాద్, రాంబాబు రాజు, శ్యామలరాజు, సమ్మారెడ్డి, ఎంఆర్కె రెడ్డి, పోశెట్టిగౌడ్, వంశీ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## కుషాయిగూడలో వైకుంఠ ఏకాదశి వేడుకలు



ప్రజాస్ఫూర్తి, కాప్రా : వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కుషాయిగూడలోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తి శ్రద్ధలతో ఘనంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకుని విశేష పూజలు, ఆర్చనలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్.వి.ఎస్.ఎస్. ప్రభాకర్, చేవెళ్ల పార్లమెంటు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్, మాజీ నగర మేయర్ బొంతు రాంమోహన్, జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్ పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో వీరేశం, సంకురి శ్రీనివాస్ గౌడ్, చక్రపాణి గౌడ్, తాళ్ల వెంకటేష్ గౌడ్, సపిడి శ్రీనివాస్ రెడ్డి, అనిల్ ముదిరాజ్, గంప కృష్ణ, చల్లా వెంకటేష్, మహేష్ గౌడ్, శ్రీదేవి, సీతారామ్ రెడ్డి, చర్లపల్లి డివిజన్ అధ్యక్షులు సింగి రెడ్డి వెంకట్ రెడ్డి, కేశట్టి ప్రసాద్, కోబరినోరి నాగ శేషు, కాప్రా సాయి గౌడ్, నీరజారెడ్డి, విట్టల్ నాయక్, కాసుల సతీష్, సుజిత్, క్రాంతి, రఘు, వెంకట్ గౌడ్, హీరాలాల్ నాయక్, చరణ్, గోపాల్ యాదవ్, ధమోధర్ చారి, పూర్ణ యాదవ్, అజీజ్, శ్రీకాంత్ రెడ్డి, ఖరీం, లింగం, కాసుల పోచయ్య గౌడ్, నాగిళ్ల బాల్ రెడ్డి ఎం. లక్ష్మణ్ గౌడ్, డి. నాదం, చల్ల ప్రభాకర్, టి. ఆనంద్ గౌడ్, రేగొండ వెంకటేశ్వర్లు, ఇస్లావత్ హరి నాయక్, తదితరులు పాల్గొని స్వామి వారి ఆశీస్సులు పొందారు.

## శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని దర్శించుకున్న బీజేపీ నేత నందనం దివాకర్



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట శ్రీ వెంకటేశ్వర స్వామి వారిని బిజెపి నాయకుల తో కలిసి బిజెపి సికింద్రాబాద్ మహంకాళి జిల్లా ప్రభారీ భాగ్యనగర్ శివాజీ సేవ సమితి అధ్యక్షులు నందనం దివాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

## మాజీ సీఎం కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ నాయక్



ప్రజాస్ఫూర్తి, కాప్రా : తెలంగాణ జాతి పిత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు (కేసీఆర్) ని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు చంద్రశేఖర్ నాయక్ మంగళవారం బంజారా హిల్స్ నందిని నగర్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ, తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ నాయకత్వం, ప్రజల పట్ల ఆయన అంకితభావం చిరస్మరణీయమని చంద్రశేఖర్ నాయక్ అన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో కేసీఆర్ చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.చంద్రశేఖర్ నాయక్ శుభాకాంక్షలను సాదరంగా స్వీకరించిన కేసీఆర్, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా నిరంతరం పనిచేయాలని సూచించారు.

# ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు

* శ్రీ ఆది మహావిష్ణు దేవాలయంలో భక్తుల కిటకిట
* ఘనంగా శ్రీదేవి, భూదేవి సమేత ఆదిమహావిష్ణువు కళ్యాణం





చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: చౌటుప్పల్ మండల వ్యాప్తంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేశారు. దేవలమ్మ నాగారంలోని శ్రీ ఆది మహావిష్ణువు దేవాలయంలో ముక్కోటి ఏకాదశి వేడుకలు నిర్వహించారు. దేవాలయంలో ఉదయం ముక్కోటి ఏకాదశి తెల్లవారుజామున మూలస్వామి, ఉత్సవరుల అభిషేకం, అనంతరం ఉత్తర ద్వార దర్శనం, ఎదుర్కొళ్ళు ఘనంగా నిర్వహించారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ఆది మహావిష్ణువు కల్యాణాన్ని కన్నుల పండుగ నిర్వహించారు. స్వామి వారి మహాప్రసాద వితరణ, స్వామి వారి సేవ, విష్ణు సహస్రనామహవనం, రుద్రహవనం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ ఆది మహావిష్ణువు దేవాలయ కమిటీ చైర్మన్ వరకాంతం జంగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆదిమహావిష్ణువు దేవాలయం యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం దేవలమ్మ నాగారం గ్రామంలోని ఉందన్నారు. ఈ ప్రాంతంలో గుట్టలు చెట్లతో నిండిపోయి అడవిని తలపించేలా ఉండేదని గుర్తు చేశారు. గతంలో పనులు జరుగుతున్న క్రమంలో విగ్రహం బయటపడిందని, దేవాలయాన్ని నిర్మించామన్నారు. గత 10సంవత్సరాలుగా కళ్యాణోత్సవాలు చేస్తున్నామన్నారు. ఈ సంవత్సరం నుంచి దేవాలయానికి శాశ్వత సభ్యత్వాలను స్వీకరిస్తున్నామన్నారు. దేవాలయానికి రోడ్డు సౌకర్యం లేకుండా భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రోడ్డు మంజూరై సిద్ధంగా ఉంది. సంవత్సరంలోపు దేవాలయానికి రోడ్డు పూర్తవుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దేవాలయం కీర్తి ఎదుగుతుందని, భక్తులు అధికంగా సందర్శిస్తున్నారన్నారు.






# రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేసి.. ప్రజల మెప్పు పొందాలి



* అల్లాపురం పాలకవర్గం, ఎనగంటి తండా సర్పంచ్ లకు సన్మానం
* మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి

చౌటుప్పల్, ప్రజాస్ఫూర్తి: రాజకీయాలకు, గ్రూపులకు అతీతంగా గ్రామాన్ని అభివృద్ధి చేసి.. ప్రజల మెప్పు పొందాలని తాజా మాజీ సర్పంచ్ కొలను శ్రీనివాస్ రెడ్డి అన్నారు. చౌటుప్పల్ మండలం అల్లాపురం, ఎనగంటి తండా నూతన పాలకవర్గాలకు మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అల్లాపురం గ్రామపంచాయతీ నూతన సర్పంచ్ టేకుల మంజుల దిలీప్ రెడ్డి, ఉపసర్పంచ్ బోయిని లింగస్వామి యాదవ్, 2వ వార్డు సభ్యుడు ఎంజాల లింగస్వామి, 3వ వార్డు సభ్యుడు సుర్కంటి స్వాతి శ్రీనివాస్ రెడ్డి, 4వ వార్డు సభ్యుడు సామ సుమిత్ర పెద్దిరెడ్డి, 5వ వార్డు సభ్యుడు ఎంజాల శ్రీకాంత్, 6వ వార్డు సభ్యురాలు వల్లపు ప్రసన్న, 7వ వార్డు సభ్యురాలు ఎంజాల అమృత, 8వ వార్డు సభ్యుడు భూతం లింగస్వామి యాదవ్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా ఎనగంటి తండా గ్రామపంచాయతీ సర్పంచ్ కరంటోతు రాజు నాయక్, వార్డు సభ్యులు భాస్కర్, మంగ్య నాయక్, మాజీ సర్పంచ్ కరంటోతు నరసింహ నాయక్ లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కొలను శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. ప్రజల నిర్ణయాన్ని అంగీకరిస్తానన్నారు. గెలుపోటములకు సంబంధం లేకుండా ఎల్లప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రజిత, గ్రామ కారోబార్ వల్లపు సాయి వెంకయ్య, నరసింహ, రసాల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ను కలిసిన పుప్పాల క్రాంతి కుమార్



కుత్బుల్లాపూర్, (ప్రజాస్ఫూర్తి) : తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు ని మంగళవారం పిడిఎస్ఎల్ యూకే అధినేత పుప్పాల క్రాంతి కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు.ఈ సందర్భంగా మాజీ సీఎం కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని దేశ విదేశాల్లో మరింత పెంచుతూ, ముఖ్యంగా యూకేలో తెలంగాణ వాసులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో పిడిఎస్ఎల్ యూకే సంస్థ కీలక పాత్ర పోషిస్తున్నదని ప్రశంసించారు. రాష్ట్రంలోని ఎంతోమంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించినందుకు పుప్పాల క్రాంతి కుమార్ కి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.అంతేకాకుండా భవిష్యత్తులో కూడా తెలంగాణ యువత అభివృద్ధి, రాష్ట్ర ప్రతిష్ఠను అంతర్జాతీయ స్థాయిలో మరింత బలోపేతం చేసే దిశగా పిడిఎస్ఎల్ యూకే సంస్థ సేవలు కొనసాగించాలని కేసీఆర్ ఆకాంక్షించారు.

# సంతోషాల నడుమ నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలి

* డిసెంబర్ 31న జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు
* డీజేలు, అధిక శబ్దానికి కఠిన చర్యలు : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు




ప్రజాస్ఫూర్తి , భద్రాద్రి కొత్తగూడెం: సంతోషాల నడుమ, ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రజలకు సూచించారు. నూతన సంవత్సరం సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు శాఖ తరపున పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.డిసెంబర్ 31వ తేదీన జిల్లా వ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఏర్పాటు చేసే ఏ కార్యక్రమమైనా పోలీసు అధికారుల నుండి ముందస్తు అనుమతులు తప్పనిసరి అని స్పష్టం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డీజేలు, అధిక శబ్దం వచ్చే బాక్సు్లు వినియోగిస్తే ఉపేక్షించేది లేదని, సంబంధిత పరికరాలను సీజ్ చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

* **సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

నూతన సంవత్సర శుభాకాంక్షల పేరుతో సైబర్ నేరగాళ్లు ఫోటోలు, మెసేజ్‌లు పంపి బ్యాంక్ ఖాతాల నుంచి నగదు కాజేయడానికి ప్రయత్నిస్తున్నారని తెలిపారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, మెసేజ్‌లను ఓపెన్ చేయవద్దని ప్రజలను ఎస్పీ సూచించారు.

* **పోలీసుల సూచనలు, నిబంధనలు**

డిసెంబర్ 31న టపాసులు, మైకులు అధిక శబ్దంతో వినియోగించి ఇతరులను ఇబ్బంది పెట్టరాదన్నారు. జిల్లా వ్యాప్తంగా డీజేలు పూర్తిగా నిషేధం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడిపితే కేసులు నమోదు చేసి, జైలు శిక్ష విధిస్తారన్నారు. రాష్ డ్రైవింగ్, బైక్ రేసింగ్, త్రిబుల్ రైడింగ్, సైలెన్సర్లు తొలగించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై దాడులు, మహిళలను ఇబ్బంది పెట్టడం, అసభ్య ప్రవర్తనకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవన్నారు. నిషేధిత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల విక్రయం లేదా వినియోగం చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. మద్యం దుకాణాలు నిర్ణీత సమయంలో మూసివేయాలి. మైనర్లకు మద్యం విక్రయించరాదన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. మైనర్లు వాహనాలు నడుపుతూ పట్టుబడితే వాహనాలు ఇచ్చిన వారిపై కేసులు నమోదు చేస్తారన్నారు. ప్రమాదం జరిగితే సంరక్షకులపైనా చర్యలు ఉంటాయన్నారు. నిబంధనలను ఎవరైనా ఉల్లంఘించినట్లు ప్రజల దృష్టికి వస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని ఎస్పీ కోరారు. నూతన సంవత్సర వేడుకలను ప్రజలు, యువత తమ కుటుంబ సభ్యులతో కలిసి తమ ఇళ్లలోనే ఆనందంగా జరుపుకోవాలని విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా 2026సంవత్సరం ప్రజలందరికీ శుభప్రదంగా ఉండాలని ఆకాంక్షిస్తూ, జిల్లా ప్రజలందరికీ పోలీస్ శాఖ తరపున జిల్లా ఎస్పీ రోహిత్ రాజు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

## వైకుంఠపురంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకున్న మంత్రి దామోదర్

* స్వామి వారి పల్లకి సేవ మోసిన మంత్రి దంపతులు..



అందోలు, ప్రజాస్ఫూర్తి: వైకుంఠ ఏకాదశి సందర్భంగా సంగారెడ్డి పట్టణం లో ఉన్న ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం వైకుంఠ పురం శ్రీ వెంకటేశ్వర దేవాలయం లో రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ దంపతులు మంగళవారం ఉత్తర ద్వార దర్శనం చేసుకున్నారు. అనంతరం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు . స్వామి వారి పల్లకి సేవలో భక్తులతో కలసి పాల్గొన్నారు . దేవాలయం అభివృద్ధికి, రాజగోపురం నిర్మాణానికి కృషి చేస్తామని మంత్రి దామోదర్ అన్నారు.ఈ సందర్భంగా ప్రజలందరికీ వైకుంఠ ఏకాదశి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ పవిత్ర రోజున శ్రీమహావిష్ణువు కృపతో ప్రజలందరి కుటుంబాలలో సుఖ శాంతులు, ఆరోగ్యం, ఐశ్వర్యం, ఐకమత్యం ఎల్లప్పుడూ నిలవాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. వైకుంఠ ద్వార దర్శనం మీ జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని స్వామివారిని ప్రార్థించినట్లు ఆయన తెలిపారు. యూత్ కాంగ్రెస్ జిల్లా నాయకులు వినయ్ గౌడ్, కేరూరు గ్రామ సర్పంచ్ కార్తీక్ గౌడ్ తో పాటు తదితరులు మంత్రి వెంట పాల్గొని స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు.

# థర్టీ ఫస్ట్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోండి

* **కుటుంబ సభ్యులతో ఆనందోత్సహాల మధ్య జరుపుకోవడం మంచిది**
* **ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: థర్టీ ఫస్ట్ వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ ఒక ప్రకటనలో సూచించారు. న్యూఇయర్ సెలబ్రేషన్స్‌పై పోలీసు శాఖ తరుపున ప్రజలకు పలు సూచనలు చేశారు. వేడుకలను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని కుటుంబ సభ్యులతో కలిసి ఇండ్ల వద్ద జరుపుకోవడం మంచిదన్నారు. రాత్రి వేళ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపడుతామని, మద్యం సేవించి ఎవరైనా వాహనాలు నడుపుతూ పట్టుబడితే కేసులుంటాయని హెచ్చరించారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించవద్దని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని, మైనర్స్ వాహనాలు నడిపి పట్టుబడితే మైనర్లతోపాటు వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. త్రిబుల్ రైడిగ్ చేయవద్దని, పెద్ద శబ్దాలు చేసే సైలెన్సర్లతో వాహనాలు నడిపితే ఆ వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. గుంపులు, గుంపులుగా రోడ్లపైకి వచ్చి కేకలు వేస్తూ తిరిగవద్దని, వాహనాలతో ర్యాలీగా వెళ్లడం చేయవద్దని తెలిపారు. ప్రజలు ఇబ్బందులకు గురయ్యేలా అధిక మోతాదులో గల సౌండ్ సిస్టమ్స్ పెట్టవద్దని, ప్రజలను భయాందోళనకు గురి చేసేలా క్రాకర్స్ కాల్చవద్దన్నారు. బహిరంగ ప్రదేశాల్లో, గేటెడ్ కమ్యూనిటీలో అనుమతి లేకుండా వేడుకలు నిర్వహించవద్దని తెలిపారు. ముఖ్యంగా రోడ్లపై కేక్ కటింగ్ లాంటివి చేయవద్దని, ఇంట్లో ఉండి కుటుంబ సభ్యులతో వేడుకలు నిర్వహించుకోవడం మంచిదని తెలిపారు. సాయంత్రం నుండి పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ కూడళ్లలో వాహన తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని, ప్రజలు ఏదైనా ఇబ్బందులకు గురైతే పోలీస్ స్టేషన్ లేక 100కు సమాచారం ఇవ్వాలన్నారు.

# జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామానికి చెందిన పారిపల్లి సాయిలు (62) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. సాయిలు గత కొంత కాలంగా షుగర్‌తో బాధ పడుతున్నాడు. నెల రోజుల క్రితం వ్యవసాయ పనులు చేస్తుండగా కుడి కాలుకు గాయం అయ్యింది. షుగర్‌తో ఆ గాయం ఇన్ఫెక్షన్ అయ్యి ఆసుపత్రిలో చికిత్స చేయించుకున్న నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం అతని పొలం వద్దకు వెళ్లి చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుని భార్య పారిపల్లి భరతవ్వ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్నామని ఎఎస్ఐ ఎండి.అబ్దుల్ ఘని తెలిపారు.

# జోగిపేటలో పీఆర్ టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ



అందోలు, ప్రజాస్ఫూర్తి: జోగిపేట బాలుర ఉన్నత పాఠశాలలో అందోలు మండల , అర్బన్ శాఖల ఆధ్వర్యంలో మంగళవారం పీఆర్ టీ యూ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఎ. మాణయ్య , మండల విద్యాధికారి బండి కృష్ణల చేతులమీదుగా సంగారెడ్డి జిల్లా 2026 వాల్ క్యాలెండర్ మరియు అందోలు మండల శాఖఅర్బన్ రూరల్ 2026 టేబుల్ క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అందోలు మండల అర్బన్ శాఖ అధ్యక్షుడు ఎస్ నరోత్తం కుమార్, అందోలు మండల రూరల్ శాఖ అధ్యక్షులు బి రాజమల్లు,రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులడు మంజ్యా నాయక్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు జనార్ధన్ రెడ్డి,వి మహేష్ కుమార చారి,చంటి చంద్రశేఖర్,జిల్లా అసోసియేట్ అధ్యక్షులు సుభాష్,జిల్లా ఉపాధ్యక్షులు చందా రాజశేఖర్, త్రినాథ్ రావు,జె నవీన్ కుమార్,ఎస్ కృష్ణయ్య,మండల అసోసియేట్ అధ్యక్షులు సంతోష్ కుమార్, ఉపాధ్యక్షులు ఏ మహేందర్, సర్దార్ బేగ్,,బి మహేష్, కార్యదర్శులు వి విరేశం, శివకుమార్ ఉపాధ్యాయులు హన్మంత్ రాజ్, రజినీకాంత్,లక్ష్మణ్ , పాఠశాల ఉపాధ్యాయినిలు పాల్గొన్నారు.

# 2025 నాకు కలిసి రాలేదు

**: కల్వకుంట్ల కవిత**

2025 సంవత్సరం తనకు ఏమాత్రం కలిసి రాలేదని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత భావోద్వేగానికి గురయ్యారు. ఈ ఏడాది పొడవునా ఎన్నో కుట్రలు, అవమానాలు, కష్టాలు, రాజకీయ సవాళ్లను తాను ఎదుర్కొన్నానని చెప్పారు. ఎంత ప్రయత్నించినా చివరికి తనపై కుట్రలు చేసినవాళ్లే గెలిచారని, అందుకే వారు ఇప్పటికీ పార్టీలో పదవులతో కొనసాగుతుండగా తాను మాత్రం బయట ఉండాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది ఒక్కసారిగా జరిగిన పరిణామం కాదని, బీఆర్ఎస్‌లోని ఒక వర్గం 2019 నుంచే తనకు వ్యతిరేకంగా పథకాలు వేసి, తన రాజకీయ భవిష్యత్తును దెబ్బతీయాలని ప్రయత్నించిందని ఆరోపించారు. తాను ఏ తప్పూ చేయలేదని, ప్రజల కోసం, ఉద్యమం కోసం మాత్రమే పనిచేశానని కవిత స్పష్టం చేశారు.

# మనసున్న మారాజు - దుండిగల్ రారాజు

* **: నిరు పేదలకు కార్పొరేట్ వైద్యం:**
* **ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్న బికేఆర్:**
* **రూపాయి ఖర్చు లేకుండా లక్షలాది రూపాయల వైద్యం**
* **హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు: స్ఫూర్తి గా నిలుస్తున్న బొంగునూరి కిషోర్ రెడ్డి సేవా కార్యక్రమాలు**







ప్రజాస్ఫూర్తి, దుండిగల్:పేద ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రజా మన్ననలు అందుకుంటున్నారు. కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నేత బొంగునూరి కిషోర్ రెడ్డి.ఆపదలో అయినవారే మొహం చాటసే ఈ రోజుల్లో తనకు ఎలాంటి రాజకీయ పదవులు లేకున్నా ప్రజా సేవే పరమావదిగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటిచెబుతున్నాడు.దుండిగల్ సర్కిల్ పరిధిలోని పలు బస్తిలు, కాలనీలలో ప్రజా ఆరోగ్యాన్ని పరిరక్షిస్తూ పేదల పెన్నిధిగా నిలుస్తున్నాడు. దుండిగల్ సర్కిల్ పరిధిలోని చంద్ర శేఖర్ రెడ్డి కాలనీ,గండి మైసమ్మ డబుల్ బెడ్ రూమ్ సముదాయం,సాయి పూజ కాలనీ, దుండిగల్ డబుల్ బెడ్ రూమ్ సముదాయం,,బహదూర్ పల్లి ఇందిరమ్మ కాలనీ, బౌరంపేట్ ప్రాంతాలలో సిఎంఆర్ హాస్పిటల్ వారి సౌజన్యంతో బికేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కిషోర్ రెడ్డి ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు.

**ఉన్నత ఆశయం:**

నిరుపేదలకు సైతం కార్పొరేటర్ స్థాయి వైద్యం అందాలన్నదే తన లక్ష్యం అంటున్న బొంగునూరి కిషోర్ రెడ్డి తన ఆలోచన ఎంత గొప్పదో ఆచరణ కూడా అంతే ఉన్నతంగా ఉంటుందని తన పనితీరుతో చాటి చెబుతున్నాడు.నిపుణులైన వైద్య బృందంతో పలు బస్తిలు కాలనీలలోని ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణి చేస్తున్నాడు. వైద్య శిబిరాలను దగ్గరుండి పర్యవేక్షిస్తూ స్థానిక ప్రజలకు అన్నా అంటే నేనున్నా అనే భరోసా ఇస్తున్నాడు.జనరల్ సర్జరీ, స్త్రీల విభాగం,చిన్న పిల్లల విభాగం,కంటి పరీక్షలు, రక్త పరీక్షలు, గుండె సంబంధిత విభాగాలలో పరీక్షలు నిర్వహించి మందుల పంపిణి చేస్తున్నారు. ఒక్క రూపాయి ఖర్చు లేకుండా తమ బస్తిలకే వచ్చి ఉచిత వైద్య సేవలు అందిస్తుండటం పట్ల,ప్రజా నేత బికేఆర్ పనితీరు పట్ల దుండిగల్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ఆపరేషన్ లు అవసరం అయిన వారిని ఇండ్ల వద్దకే వచ్చి బస్ లలో తీసుకెళ్లి వైద్యం చేయించడం ద్వారా తమలాంటి వారికి ఎంతో సహాయం చేస్తున్నాడని, ప్రదానంగా పేద ప్రజలు అధిక సంఖ్యలో వుండే బస్తిలలో ఉచిత వైద్య సేవలు అందిస్తుండటంతో కిషోర్ రెడ్డి అంటే పేదల పెన్నిధి అని కొనియాడుతున్నారు.

**భరోసా ఇస్తున్న బికేఆర్:**

దుండిగల్ సర్కిల్ పరిధిలోని డివిజన్ లలో బికేఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించేలా ట్రస్ట్ చైర్మెన్ బొంగునూరి కిషోర్ రెడ్డి ముందుకు సాగుతున్నట్టుగా కనిపిస్తుంది. నిరంతరం ప్రజలకు అందుబాటులో వుంటూ దుండిగల్ పరిధిలోని బస్తిలు, కాలనీలలో పర్యటిస్తూ ప్రజా సమస్యలు తెలుసుకుంటున్నారు. స్థానిక నాయకులను సమన్వయం చేస్తూ ప్రజలతో మమేకం అవుతూ ట్రస్ట్ సభ్యుల సహకారంతో ప్రజల ఆరోగ్య సంరక్షణకు కృషి చేస్తున్నారు.



# భద్రాద్రిలో వైకుంఠ ద్వార దర్శన మహోత్సవం

* **ఉత్తర ద్వార దర్శనంతో తరించిన భక్తజనం**
* **వైకుంఠ రాముడిగా అనుగ్రహించిన భద్రాద్రి రామయ్య**



ప్రజా స్ఫూర్తి,భద్రాద్రి కొత్తగూడెం: దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధిగాంచిన భద్రాచలంలో ముక్కోటి ఏకాదశి మహోత్సవాలు ఆధ్యాత్మిక వైభవోపేతంగా, భక్తుల హృదయాలను ఉప్పొంగించేలా ఘనంగా నిర్వహించబడ్డాయి.భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా భక్తులకు దర్శనమిచ్చి అనుగ్రహించారు. వైకుంఠ రాముడిగా అలంకరించబడిన స్వామివారి దివ్య దర్శనంతో భక్తులు పరవశించి, శ్రీ రామ జయ రామ జయ జయ రామ అనే జయజయధ్వానాలతో భద్రాద్రి క్షేత్రం మారుమోగింది. ఉత్తర ద్వార దర్శనాన్ని దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వీవీఐపీ, వీఐపీ సెక్టార్లతో పాటు సాధారణ భక్తుల కోసం ఏర్పాటు చేసిన వివిధ సెక్టార్లలో భక్తులు శాంతియుతంగా వేడుకలను తిలకించారు. వేదపండితులు, స్థానాచార్యులు ముక్కోటి ఏకాదశి విశిష్టతను వివరించగా, అర్చకులు 108 ఒత్తులతో మహా హారతి నిర్వహించారు. అనంతరం ఉత్తర ద్వారం ద్వారా దర్శనం అనంతరం ఉత్సవ మూర్తులను మాడ వీధుల్లో భక్తిశ్రద్ధల మధ్య ఊరేగించారు.ఈ సందర్భంగా స్వామివారు గరుడ వాహనరూపుడిగా శ్రీమహావిష్ణువు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అర్చకులు విశేష ఆరాధనలు, శ్రీరామ పదాక్షరీ మంత్ర సంపుటిత అష్టోత్తర శతనామార్చన, చతుర్వేద పఠనం, గరుడ ప్రబంధాలు, ఇతిహాస పఠనం, శరణాగతి గజ్జగరుడ దండం, భక్తరామదాసు రచించిన దాశరథి శతక పఠనం నిర్వహించారు. వైకుంఠ రాముడికి అష్టోత్తర శత హారతిని భక్తిశ్రద్ధలతో సమర్పించారు. భక్తరామదాసు కాలం నుంచీ కొనసాగుతున్న సంప్రదాయం ప్రకారం భద్రాచలం తహసీల్దార్ శ్రీనివాస్ మూలవిరాట్టులకు స్నపన కార్యక్రమం నిర్వహించారు. ఉత్తర ద్వార దర్శనం అనంతరం వైకుంఠరాముడు తిరువీధి సేవకు బయలుదేరారు. చలువ చప్పర వాహనంపై పెరియాళ్వార్, నమ్మాళ్వార్, మరో వాహనంపై అండాళ్ అమ్మవారు, హనుమత్ వాహనంపై లక్ష్మణస్వామి, గజవాహనంపై సీతమ్మవారు, గరుడ వాహనంపై శ్రీ సీతారామచంద్రమూర్తుల తిరువీధి సేవ మేళతాళాలు, భాజా భజంత్రీలు, వేద మంత్రోచ్చారణల మధ్య శోభాయమానంగా సాగింది. రాపత్తు ఉత్సవాలతో వేడుకలు మరింత వైభవాన్ని సంతరించుకున్నాయి. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఎప్పటికప్పుడు యంత్రాంగాన్ని అప్రమత్తం చేస్తూ, ప్రతి సెక్టార్‌లో ఏర్పాట్ల పర్యవేక్షణకు జిల్లా అధికారులు, లైజన్ అధికారులను నియమించారు. బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ వేడుకకు భద్రాచలం, శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్ రావు, పినపాక శాసన సభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, ఐ టి డి ఏ పి ఓ రాహుల్, ట్రైనీ కలెక్టర్ సౌరబ్ శర్మ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్ ఏఎస్పీ విక్రాంత్ సింగ్, దేవస్థానం ఈఓ దామోదర్ రావు, భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణదొర తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరై స్వామివారి దర్శనం చేసుకున్నారు.

* **వైకుంఠ ఏకాదశి ఉత్సవాలు విజయవంతం – జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్.**

సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో, అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించిన ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు, ఉత్తర ద్వార దర్శనం కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సమర్థవంతమైన ఏర్పాట్లు చేయగలిగామని తెలిపారు. ఈ ఉత్సవాల నిర్వహణలో సహకరించిన జిల్లా యంత్రాంగానికి, భక్తులకు, పాత్రికేయులకు ఆయన ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.



# సైబర్ మోసాలపై అవగాహనతోనే నియంత్రణ

* **ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్**
* **డోర్ పోస్టర్లు అంటిస్తున్న సైబర్ క్రైమ్ వారియర్ రాజశేఖర్**




ప్రజాస్ఫూర్తి, ముస్తాబాద్: సైబర్ మోసాలపై అవగాహనతోనే నియంత్రించవచ్చని ముస్తాబాద్ ఎస్ఐ సిహెచ్.గణేష్ తెలిపారు. ముస్తాబాద్ మండలంలో జరుగుతున్న సైబర్ క్రైంని నియంత్రించడం కోసం మండల ప్రజలకు అవగాహన కల్పించడానికి జిల్లా ఎస్పీ మహేష్ బీ గీతే ఆదేశాలతో పోలీస్ యంత్రాంగం చర్యలు చేపట్టింది. ముస్తాబాద్ మండలంలోని అన్ని గ్రామాల ప్రధాన కూడళ్ళతోపాటు,హోటల్స్, ఆసుపత్రులు, షాపింగ్ మాల్స్ వద్ద సైబర్ క్రైమ్ వారియర్ రాజశేఖర్ డోర్ పోస్టర్స్ అంటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆధునిక సాంకేతికత రోజు రోజుకు పెరుగుతున్న తరుణంలో అదే తరహాలో సైబర్ నేరగాళ్లు రోజుకో కొత్త తరహాలో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. అయితే సైబర్ నేరాలపై ఎప్పటికప్పుడు అవగాహన పెంచుకుంటూ అప్రమత్తంగా ఉంటే వాటి బారీన పడకుండా ఉండవచ్చని, తద్వారా సైబర్ నేరాలు నియంత్రించగలమని తెలిపారు. అపరిచిత కాల్స్ అటెండ్ చేయవద్దని, ఆన్లైన్ మోసాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. టెలికం కంపెనీల పేరుతో వచ్చే ఫ్రాడ్ కాల్స్ ని గుర్తించి ఫోన్ లో సంభాషణలు కొనసాగించకూడదని అన్నారు. అపరిచితుల ద్వారా వచ్చే ఫోన్ కాల్స్‌కి ఓటిపి నంబర్ చెప్పకూడదన్నారు. ఆన్లైన్‌లో జాబ్స్ పేరుతో సహితం మోసాలు జరుగుతున్నట్లు, అంతేగాకుండా ప్రైజ్ మని గెలిచారని వచ్చే ఫోన్ కాల్స్ ని నమ్మకూడదన్నారు. మండల పరిధిలో ఎక్కడైనా సైబర్ మోసం జరిగిన వెంటనే 1930 కాల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సైబర్ క్రైం పట్ల అవేర్ నెస్ డోర్ పోస్టర్స్ అంటిస్తున్న తెలిపారు.

# రంగనాథ స్వామి దేవాలయంలో ఉత్తర ద్వారా దర్శనం

* **వేలాదిగా హజరైన భక్తులు**



అందోలు, ప్రజాస్ఫూర్తి: వైకుంఠ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం అందోలు మండలంలోని ఆయా దేవాలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. అందోల్ గ్రామంలో కొలువైన శ్రీ భూనీలా సమేత రంగనాథ స్వామి దేవాలయంలో స్వామివారి దర్శనానికి చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు వందల సంఖ్యలో హజరై దర్శించుకున్నారు. ముక్కోటి వైకుంఠ ఏకాదశి సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఉత్తర ద్వారా దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఉదయం ఆలయ పూజారి శ్యామ్ నాథ్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. జోగిపేట 17వ వార్డు మాజీ కౌన్సిలర్ ఆకుల చిట్టిబాబు ఆధ్వర్యంలో రంగు రంగులు పూలతో రంగనాథ ఆలయాన్ని అలంకరించారు. ఆలయంలో చిట్టిబాబు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్సాన్ పల్లి గ్రామానికి చెందిన ఆరేటి అరుణ-సుదర్శన్ రెడ్డి, ఆరేటి స్వప్న-సురేందర్ రెడ్డి దంపతులు తులసి మొక్కలను అందజేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకోగా . వారికి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

## శ్రీ మహావిష్ణు ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలి...

**: తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బిక్షపతి...**



అందోలు, ప్రజాస్ఫూర్తి: వైకుంఠ వాసుడైన శ్రీమహావిష్ణువారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని తెలంగాణ రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బిక్షపతి అన్నారు. మంగళవారం వైకుంఠ ఏకాదశి పవిత్ర పర్వదిన సందర్భంగా అల్లాదుర్గ్ గడి పెద్దాపూర్ గ్రామాల్లో వెంకటేశ్వర ఆలయాల్లో ఉత్తర ద్వారా దర్శనం చేసుకున్నారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంవత్సరంలో అత్యంత విశిష్టమైన ఆధ్యాత్మిక పర్వదినాల్లో ఒకటిగా భావించే వైకుంఠ ఏకాదశి ఒకటి అన్నారు. ఈ శుభ సందర్భంగా ఆయన ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. వైకుంఠ వాసుడైన శ్రీమహావిష్ణువారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజల జీవితాల్లో శాంతి, సుఖసంతోషాలు, ఆరోగ్యం, సమృద్ధి వెల్లివిరియాలని ఆయన ఆకాంక్షించారు. వైకుంఠ ఏకాదశి పర్వదినం ప్రతి కుటుంబానికి మంగళకరంగా మారాలని ఆయన పేర్కొన్నారు.

## జిల్లాలో యూరియా ఎరువులకు ఎలాంటి కొరత లేదు

*** జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**




ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో రైతులకు అవసరమైన యూరియా ఎరువులు సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో యాసంగి పంటల సాగును దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికతో యూరియా సరఫరా చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు.ప్రస్తుత యాసంగి కాలంలో జిల్లాలో మొక్కజొన్న మరియు వరి ప్రధాన పంటలుగా సాగు అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఇప్పటివరకు జిల్లాలో మొక్కజొన్న పంట 38,500 ఎకరాల్లో, వరి పంట 8,750 ఎకరాల్లో సాగు అయిందని వెల్లడించారు. వరి నాట్లు ప్రస్తుతం కొనసాగుతున్నాయని, ఈ విస్తీర్ణం రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలిపారు.ఈ విస్తీర్ణానికి అనుగుణంగా జిల్లాలో యూరియా అవసరాన్ని అంచనా వేసి సరఫరా చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాకు మొత్తం 28,500 మెట్రిక్ టన్నుల యూరియా అవసరమవగా, అందులో 8,750 మెట్రిక్ టన్నులు ఇప్పటికే సరఫరా అయ్యాయని తలిపారు. ప్రస్తుతం జిల్లాలోని గోదాముల్లో 1,35,800 బస్తాల యూరియా నిల్వలు ఉన్నాయని, అదనంగా 1,51,200 బస్తాల యూరియా త్వరలో జిల్లాకు చేరుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. రైతులు ఎవరూ యూరియా కొరతపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. అవసరమున్న చోట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఏసిఎస్) ద్వారా రైతులకు నిరంతరంగా యూరియా సరఫరా చేయనున్నట్లు తెలిపారు.రైతులు అవసరానికి మించి యూరియా ముందుగానే కొనుగోలు చేసి నిల్వ చేయవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఇలా చేయడం వలన ఇతర రైతుల్లో అనవసర ఆందోళన ఏర్పడే అవకాశం ఉందని అన్నారు. జిల్లాలో యాసంగి సాగుకు అవసరమైన ఎరువుల సరఫరా నిరంతరంగా కొనసాగుతుందని కలెక్టర్ కష్టం చేశారు.యూరియా పంపిణీలో ఎలాంటి అక్రమాలు జరగకుండా అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. అక్రమ నిల్వలు, అధిక ధరలకు విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## టెర్రర్ మాంజా.. గాలిపటాలపై రైల్వేశాఖ కీలక విజ్ఞప్తి



సంక్రాంతి పండుగొస్తుందంటే చాలు.. తెలుగు రాష్ట్రాలతో పాటు దేశంలో గాలిపటాల సందడి కనిపిస్తుంది. కానీ.. ఈ గాలిపటాన్ని ఎగురవేసేందుకు చైనా మాంజా వాడుతుండటం ప్రాణాలమీదికి తీసుకొస్తుంది. గాలిపటాల కోసం మాంజా వాడొద్దని ఇప్పటికే పోలీసులు సూచించారు. కానీ పలు ప్రాంతాల్లో ఈ మాంజాను ఇంకా అమ్ముతున్నారు. అది కంటికి కనిపించనంత సన్నగా ఉండటంతో.. బైక్ పై వెళ్లేవారు తరచూ ప్రమాదానికి గురవుతున్నారు. ముఖ్యంగా రైల్వే ట్రాక్‌లు, రైల్వే స్టేషన్లు, ఎలక్ట్రిక్ ట్రాక్షన్ లైన్ల సమీపంలో గాలిపటాలు ఎగురవేయవద్దని, పండుగ వేళ ప్రమదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరింది. రైల్వే లైన్ల మీదుగా వెళ్లే 25కేవీ హైటెన్షన్ వైర్లకు మాంజా తగిలితే ప్రాణాపాయం తప్పదని హెచ్చరించారు. ఈ సందర్భంగా గత సంక్రాంతి సీజన్లో ట్రాక్ ల వద్ద పతంగులు ఎగురవేస్తూ పలువురు విద్యుధ్ఘాతానికి గురైన విషయాన్ని రైల్వే అధికారుల గుర్తు చేశారు. మాంజాలో రసాయనిక పదార్థాలు, మెటాలిక్ ఉండటం వల్ల అవ విద్యుత్ వాహకాలుగా పనిచేస్తాయని వివరించారు.

# జర్నలిస్టుల ఆవేదనలు పరిగణలోకి తీసుకోండి

*** జీవో 252లో సవరణలు*చేయండి**
*** మంత్రి పొంగులేటికి టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందం అభ్యర్ధన**





(ప్రజాస్ఫూర్తి, హైదరాబాద్) : జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డుల విషయంలో, కొత్త మార్గదర్శకాలతో ఇటీవల ప్రభుత్వం జారీ చేసిన జీవో 252లో కొన్ని సవరణలు చేపట్టాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) కోరింది. మంగళవారం నాడు టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షులు కె.విరాహత్ అలీ నేతృత్వంలో యూనియన్ ప్రతినిధి బృందం సచివాలయంలో రాష్ట్ర రెవెన్యూ, సమాచార మరియు పౌరసంబంధాల, గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కలిసి జీవో పై చర్చించడంతో పాటు వినతి పత్రాన్ని అందించింది. ఈ సందర్భంగా విరాహత్ అలీ మాట్లాడుతూ, ఇటీవల జరిగిన తమ సంఘం ముఖ్యుల సమావేశం, 252జీవో ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, జర్నలిస్టుల నుంచి వ్యక్తం అవుతున్న అభ్యంతరాలు, జీవో లో లోటుపాట్లపై చర్చించి, కొన్ని సవరణలు అవసరమనే అభిప్రాయానికి వచ్చినట్లు మంత్రితో తెలిపారు. గతంలో అక్రెడిటేషన్ కార్డులతో డెస్క్ జర్నలిస్టులందరికీ కాకుండా కొందరికి మాత్రమే న్యాయం జరిగేదని, ప్రస్తుతం అలా కాకుండా బస్ పాస్ లతో సహా ప్రభుత్వం కల్పించే ప్రతి సంక్షేమ పథకం రిపోర్టర్లు, డెస్క్ జర్నలిస్టులనే తేడా లేకుండా, ఎలాంటి వివక్ష లేకుండా ప్రతి డెస్క్ జర్నలిస్టుకు వర్తింపజేసేలా జీవో లో సవరించాలని ఆయన కోరారు. కేబుల్ టీవీ ఛానెల్స్ కు సంబంధించి, జీవో లో పేర్కొన్న అస్పష్టతను సరిచేయాలన్నారు.

*** అరులైన వారికి అన్యాయం జరగొద్దు**

గ్రేటర్ హైదరాబాద్ తో పాటు రాష్ట్రంలోని ఇతర ప్రధాన నగరాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులకు మండలానికి ఒకటి కాకుండా, సదరు మండలంలో ప్రధాన డేట్ లైన్ లను గుర్తించి, వాటి ప్రకారం అక్రెడిటేషన్ కార్డులు జారీ చేసేందుకు జీవో ను సవరించాలని కోరారు. చిన్న పత్రికలకు సర్క్యులేషన్ ఆధారంగా జిల్లాల్లో కూడా అక్రెడిటేషన్ కార్డులు జారీ చేయాలన్నారు. ప్రధాన పత్రికలు, శాటిలైట్ న్యూస్ ఛానెల్స్ కు కార్డుల కుదింపు జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు, వీడియో జర్నలిస్టులకు, కెమెరా జర్నలిస్టులకు వారి కార్యాలయాల సిఫారసుల మేరకు అందరికీ అక్రెడిటేషన్ కార్డులు జారీ అయ్యేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేసారు. రాష్ట్రంలో ఉర్దూ అధికార భాషా కనక, ఇతర భాషల సర్క్యులేషన్ లతో, గ్రేడింగ్ లతో వాటిని పోల్చకుండా, ఉర్దూ పత్రికలు సర్క్యులెట్ అవుతున్న ప్రాంతాలను గుర్తించి, ప్రత్యేక కేటగిరి క్రింద జిల్లా, మండల స్థాయిల్లో ఉర్దూ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇచ్చేలా జీవో లో పొందుపర్చాలని కోరారు.

**వృత్తి అనుభవం తగ్గించాలి**

వెటరన్, ఫ్రీలాన్స్ జర్నలిస్టులు అక్రెడిటేషన్ కార్డులు పొందడానికి, జీవో లో పేర్కొన్న వృత్తి అనుభవాన్ని కొంత తగ్గిస్తూ సవరించాలని మంత్రిని ఆయన కోరారు. టీయూడబ్ల్యూజే అభ్యర్ధనపై మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పందిస్తూ, త్వరలో జర్నలిస్టు సంఘాల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించి, ఏమైనా లోటుపాట్లుంటే సరిచేసుకుందామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన ప్రతినిధి బృందంలో టీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి కల్కూరి రాములు, రాష్ట్ర కార్యదర్శులు కె. శ్రీకాంత్ రెడ్డి, వి.యాదగిరి, రాష్ట్ర కోశాధికారి యం.వెంకట్ రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏ. రాజేష్, ఎం.డి.గౌస్, హెచ్.యూ.జే అధ్యక్షుడు శంకర్ గౌడ్, రాష్ట్ర చిన్న, మధ్య తరగతి పత్రికల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యూసుఫ్ బాబు, అశోక్ తదితరులు ఉన్నారు.

*** టీయూడబ్ల్యూజే సూచనలను పరిశీలిస్తాం**

జీవో 252పై తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం లిఖిత పూర్వకంగా చేసిన సూచనలను పరిశీలిస్తామని, మంగళవారం నాడు సచివాలయంలో తనను కలిసిన టీయూడబ్ల్యూజే ప్రతినిధి బృందానికి రాష్ట్ర సమాచార మరియు పౌర సంబంధాల శాఖ కమిషనర్ ప్రియాంక హామీ ఇచ్చారు. అసెంబ్లీ సమావేశాల తర్వాత సమావేశాన్ని నిర్వహించి జర్నలిస్టు సంఘాల అభిప్రాయాలు స్వీకరిస్తామన్నారు.



## నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలి

*** సిపిఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్**

జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి) : నూతన సంవత్సరం వేడుకలు ప్రశాంతంగా అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిపిఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ అన్నారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జగద్గిరిగుట్ట పరిధిలో ప్రశాంతంగా జరిగేలా ఏర్పాటు చెయ్యాలని నిఘా, భద్రత పెంచాలని కోరుతూ మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో సీఐ వెంకటేష్ కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు సీఐ కి బెల్ట్ షాప్ లు ఈ రెండు రోజులు ఎట్టి పరిస్థితులో నడవకుండా కఠినమైన ఆదేశాలు జారిచేయ్యాలన్నారు. స్టేషన్ పరిధిలోని శ్రీనివాస్ నగర్ లాస్ట్ బస్టాప్, స్మశాన వాటిక, ఈ సేవ సెంటర్, హెచ్ఎంటి స్మశాన వాటిక, రింగ్ బస్తి చౌరస్తా, ప్రభుత్వ పాఠశాలల దగ్గర, దేవాలయం మెట్ల దగ్గర, హెచ్ఎంటి ఖాళీ స్థలంలో, రాజీవ్ గృహకల్ప కాని స్థలాల్లో, బెల్ట్ షాపులు, గుట్ట చౌరస్తా తదితర ప్రాంతంలో నిత్యం గస్తీ ఉండేలా ఏర్పాటు చేయాలని కోరారు. గత సంవత్సరం కూడా ప్రశాంతంగా జరిగిందని ఈ సంవత్సరం కూడా ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని అవసరమైతే పత్రిక ప్రకటనను విడుదల చేయాలని కోరారు. దీంతో సీఐ స్పందిస్తూ శాంతి భద్రత ల రక్షణ కోసం తమ వంతుగా పనిచేస్తామన్నారు. ఆయా బస్తిల , బెల్ట్ షాప్ ల వివరాలను రాసుకొని ఎలాంటి గొడవలు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సహాయ కార్యదర్శులు హరినాథ్ రావు,రాములు , కోశాధికారి సదానంద్, జర్నలిస్టు రామస్వామి, సిపిఐ నాయకులు సాయిలు, కే వెంకటేష్, శ్రీనివాస్ చారి, రాధాకృష్ణ, శ్రీనివాస్ యాదవ్, కుమారస్వామి, వంశీ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి కృషి

*** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్**

కుత్బుల్లాపూర్ , (ప్రజాస్ఫూర్తి) : గాజులరామారం సర్కిల్ పరిధి,హెచ్.ఏ.ఎల్ కాలనీ లోని శ్రీ నల్లగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు.మంగళవారం దేవస్థానంలో గిరిప్రదక్షిణ కు దారి,దేవాలయ గుట్ట మీదకి మెట్ల దారి,కళ్యాణ మండపానికి ఛానల్ గేట్లను ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులతో కలిసి ప్రారంభించారు. అనంతరం అయన దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో సత్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్ష్మీ నరసింహ స్వామి కృపా కటాక్షాలు ఎల్లప్పుడూ ప్రజలందరి పైన ఉండాలని,సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో కేకేఎమ్ ట్రస్ట్ చైర్మన్ కూన శ్రీనివాస్ గౌడ్,ఆలయ కమిటీ చైర్మన్ అముర ఇంద్రసేన గుప్తా,ఉపాధ్యక్షులు ఎన్.శ్రీరాములు ,ఆర్.యాదగిరి,ప్రధాన కార్యదర్శి, ఈ.సురేష్,కోశాధికారి, నరసింహారెడ్డి,కార్యదర్శి, శంకర్ రెడ్డి,ఇంద్రసేనారెడ్డి,రవీందర్ గౌడ్,టీవీ.శ్రీను, భాస్కర్ రెడ్డి,మోహన్ రెడ్డి, సిహెచ్.బుచ్చిరెడ్డి,అంజి యాదవ్,గోవర్ధన్ రెడ్డి,ఈవి.సాగర్ రావు,మాజీ కౌన్సిలర్ బొబ్బా రంగారావు,గౌరిశెట్టి శివఈశ్వరరావు, ఎండి.షాకీర్,వెంకట్ ,నర్సింగరావు,మురళి,ప్రభాకర్ రెడ్డి,భక్తులు పాల్గొన్నారు.

## జగద్గిరిగుట్ట శ్రీవారి ఆలయంలో వైభవంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



జగద్గిరిగుట్ట, (ప్రజాస్ఫూర్తి ) : వైకుంఠ ఏకాదశి పర్వదినం సందర్భంగా జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీవారి ఆలయంలో మంగళవారం వైభవంగా జరిగాయి.ఉదయం వేకువజాము నుండే శ్రీ వారి ఆలయం భక్తులతో కిటకిటలాడాయి.జగద్గిరిగుట్ట కొండపై వెలసిన శ్రీవారి ఆలయంలో(దేవాదాయ ధర్మాదాయ శాఖ)స్థానిక కార్పొరేటర్ కొలుకుల జగన్, తోపాటు,కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ ఇంచార్జి కొలను హనుమంత రెడ్డి, బి ఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ లు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పర్యవేక్షణ అధికారి కృష్ణమాచార్యులు,ధర్మకర్తల మండల సభ్యులు వారికి స్వాగతం పలికారు.అనంతరం వారిని శాలువాలతో సన్మానించారు.ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాటు చేశారు.జగద్గిరిగుట్ట పోలీసులు తగిన బందోబస్తు నిర్వహించారు.అనంతరం సాయంత్రం శ్రీవారి ఊరేగింపు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కె. నరేందర్ రెడ్డి, ధర్మకర్తల మండల సభ్యులు బుచ్చిరెడ్డి,రవీందర్,అనిత స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## మహిళల భద్రత–బాలల సంరక్షణపై ఒక నిమిషం చలనచిత్రోత్సవం




మహిళల భద్రత, బాలల సంరక్షణపై సమాజంలో మార్పు తీసుకురావాలనే లక్ష్యంతో తెలంగాణ పోలీసుల మహిళల భద్రత విభాగం, యూనిసెఫ్, అన్నపూర్ణ ఫిల్మ్ అండ్ మీడియా కళాశాలల భాగస్వామ్యంతో ఒక నిమిషం చలనచిత్రోత్సవం ప్రదర్శనకు ఔత్సహికులను ఆహ్వానిస్తున్నట్లు ఉమెన్ సెఫ్టీ ఏడీజీపీ చారుసిన్హా తెలిపారు. చట్టాలు బలపడినప్పటికీ మహిళలు, పిల్లలపై నేరాలు ఇంకా కొనసాగుతున్న నేపథ్యంలో, నిజమైన మార్పునకు మనస్తత్వం మారాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. ఈ మార్పులో యువత కీలక పాత్ర పోషించగలదని పేర్కొన్నారు. 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయస్సు గల విద్యార్థులు, యువ చలనచిత్రకారులు ఈ పోటీలో పాల్గొనవచ్చని తెలిపారు. చిత్రాల నిడివి ఒక నిమిషం ఉండాలని, ఇంగ్లీష్, హిందీ, తెలుగు భాషల్లో రూపొందించవచ్చని, ఏఐ టూల్స్ ఉపయోగించరాదని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 30 మాస్ కమ్యూనికేషన్ కళాశాలలను భాగస్వాములుగా చేస్తూ, మార్చి 9న అవార్డుల కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

# గ్రూప్-1 కేసులో ముగిసిన వాదనలు.. జనవరి 22న తీర్పు

హైదరాబాద్: గ్రూప్ 1 ఫలితాలను రద్దు చేస్తూ గతంలో సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతోపాటు పలువురు ఉద్యోగులు దాఖలు చేసిన అప్పీళ్లపై హైకోర్టులో విచారణ ముగిసింది. ఇరు వైపులా వాదనలు విన్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్‌లతో కూడిన ధర్మాసనం జనవరి 22న తీర్పు వెల్లడిస్తామని తెలిపింది. టీజీపీఎస్సీ తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నిబంధనల ప్రకారం పారదర్శకంగా పరీక్షలు జరిగాయన్నారు. మూల్యాంకనంలో అవకతవకలు జరగకూడదన్న లక్ష్యంతో ఇద్దరి చేత చేయించారని తెలిపారు. పరీక్ష కేంద్రాల పెంపు, పరిపాలనాపరమైన సౌలభ్యం కోసం ప్రిలిమ్స్‌కు, మెయిన్స్‌కు హాల్‌టికెట్లను వేర్వేరుగా జారీ చేసిందని చెప్పారు. పరీక్షల్లో కాపీయింగ్ జరిగిందని ఎలాంటి ఆరోపణలు లేవని వెల్లడించారు. అర్హత సాధించిన అభ్యర్థుల తరఫున సీనియర్ న్యాయవాది డి.ప్రకాశ్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. పరీక్షల్లో అర్హత సాధించలేనివారు కోర్టును ఆశ్రయించారన్నారు. రెండు హాల్‌టికెట్లు ఉంటాయని పరీక్షలకు ముందే వెల్లడించినా అప్పుడు అభ్యంతరం చెప్పకుండా, ఫలితాలు విడుదలయ్యాక పిటిషన్ వేయడం చెల్లదన్నారు.





## తెలంగాణ ఈఏపీ సెట్ సహా పలు ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదల

హైదరాబాద్: తెలంగాణ ఈఏపీ సెట్ తో పాటు పలు ప్రవేశ పరీక్షల షెడ్యూల్ ఖరారైంది. జేఎన్‌టీయూ ఆధ్వర్యంలో మే 4 నుంచి 11 వరకు ఈఏపీసెట్ నిర్వహించనున్నట్టు ఉన్నత విద్యామండలి వెల్లడించింది.

* మే 4, 5 తేదీల్లో అగ్రికల్చర్, ఫార్మా
* మే 9 నుంచి 11 వరకు ఇంజినీరింగ్ ప్రవేశపరీక్షలు
* మే 12న టీజీ ఎడ్ సెట్ పరీక్ష
* మే 13, 14 తేదీల్లో టీజీ ఐ సెట్ పరీక్ష
* మే 15న టీజీ ఈసెట్ పరీక్ష
* మే 18న టీజీ లాసెట్, పీజీ ఎల్ సెట్ పరీక్షలు
* మే 28 నుంచి 31 వరకు టీజీ పీజీ ఈసెట్
* మే 31 నుంచి జూన్ 3 వరకు టీజీ పీఈసెట్ పరీక్ష ఉంటుందని ఉన్నత విద్యామండలి తెలిపింది.

## గోవా నుంచి హైదరాబాద్‌కు డ్రగ్స్..
# బంజారాహిల్స్‌కు చెందిన యువతి అరెస్ట్

హైదరాబాద్: నగరంలో మాదకద్రవ్యాల కట్టడికి పోలీసులు ఎన్ని చర్యలు తీసుకుంటున్నా.. డ్రగ్స్ పెడ్లర్లు కొత్తదారుల్లో సరఫరా కొనసాగిస్తున్నారు. తాజాగా గోవా నుంచి హైదరాబాద్‌కు భారీగా డ్రగ్స్ తీసుకొస్తున్న యువతిని పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితురాలిని బంజారాహిల్స్‌కు చెందిన హస్సాగా గుర్తించారు. 2024 డిసెంబరులో గోవా వెళ్లిన ఆమె.. అక్కడ మొదటిసారి MDMA రుచి చూసింది. ఆ తర్వాత మాదకద్రవ్యాలకు బానిసగా మారింది. కేవలం వినియోగదారురాలిగానే కాకుండా, తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో డ్రగ్స్ పెడ్లర్‌గా మారినట్లు పోలీసులు వెల్లడించారు. గోవాలో నైజీరియన్ డ్రగ్ మాఫియాతో ఆమె సంబంధాలు ఏర్పచుకున్నట్లు విచారణలో తేలింది. వారి వద్ద నుంచి తక్కువ ధరకు MDMA, LSD వంటి ఖరీదైన డ్రగ్స్‌ను కొనుగోలు చేసి.. హైదరాబాద్ తీసుకువచ్చి ఇక్కడి యువతకు విక్రయిస్తున్నట్లు గుర్తించారు.



ఈ ఏడాది మార్చి నుంచి ఆమె పలుమార్లు గోవాకు వెళ్లి డ్రగ్స్ తీసుకొచ్చినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. ఈనెల 26న సియోలిమ్, మాపూసా ప్రాంతాల్లో ఆమె డ్రగ్స్ డీల్స్ చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. హస్సాపై గతంలో కూడా గోల్కొండ పోలీస్ స్టేషన్‌లో NDPS యాక్ట్ కింద కేసు నమోదైంది. ఆ కేసులో జైలుకు వెళ్లిన ఆమె.. ఇటీవల బెయిల్‌పై బయటకు వచ్చింది. జైలు నుంచి వచ్చిన తర్వాత కూడా పద్ధతి మార్చుకోకుండా.. మరింత పకడ్బందీగా హైదరాబాద్‌కు చెందిన మరికొందరు సహచరులతో కలిసి డ్రగ్స్ దందా కొనసాగిస్తుండగా పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. నగరంలో ఆమె ఎవరెవరికి డ్రగ్స్ విక్రయిస్తోంది? ఈ ముఠాలో ఇంకా ఎంతమంది సభ్యులు ఉన్నారు? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. ఈ గొలుసుకట్టు నెట్‌వర్క్‌లో ఉన్న మిగిలిన నిందితులను కూడా త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

## తెలంగాణలో పలువురు
# ఐఏఎస్‌ల బదిలీలు

రాష్ట్ర ప్రభుత్వం పలువురు ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు సీఎస్ రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా జి.శ్రీజన, వినయ్ కృష్ణారెడ్డి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్‌గా శృతి ఓజా, నల్గొండ నూతన కలెక్టర్‌గా బడుగు చంద్రశేఖర్, నిజామాబాద్ నూతన కలెక్టర్‌గా త్రిపాఠి, నారాయణపేట అదనపు కలెక్టర్‌గా ఉమాశంకర్ ప్రసాద్‌లకు బాధ్యతలు అప్పగించారు. ఈ బదిలీలు, నియామకాలు తెలంగాణ రాష్ట్ర పరిపాలనలో కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. ప్రజలకు మరింత సమర్థవంతమైన సేవలు అందించడం, పరిపాలనలో వేగం పెంచడం, బాధ్యతాయుత పాలనను బలోపేతం చేయడమే ఈ మార్పుల లక్ష్యమని అధికారులు




తెలిపారు. జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు అభివృద్ధి కార్యక్రమాలకు ఊతం లభిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

## ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెర..!
# జీవో 230 జారీపై నిమ్స్ ఉద్యోగుల హర్షం

హైదరాబాద్ : నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్) ఉద్యోగుల చిరకాల స్వప్నమైన 'ఆర్జిత సెలవుల నగదు మార్పిడి కి ప్రభుత్వం పచ్చజెండా ఊపడం పట్ల నిమ్స్ ఉద్యోగ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది. తమ విజ్ఞప్తిని మన్నించి, ఇచ్చిన మాట ప్రకారం సమస్యను పరిష్కరించిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహని ఈరోజు (మంగళవారం) నిమ్స్ ఉద్యోగులు, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ఆఫీస్ లో కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందించి, ఘనంగా సత్కరించి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. ఎయిమ్స్ పే స్కేల్స్ పొందుతున్న నిమ్స్ రెగ్యులర్ ఉద్యోగులకు ఇప్పటి వరకు ఆర్జిత సెలవులను నగదుగా మార్చుకునే అవకాశం లేదు. ఇటీవల హాస్పిటల్ నర్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిసి తమ ఆవేదనను వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి దామోదర రాజనర్సింహ, అధికారులతో చర్చించి తగు ఆదేశాలు జారీ చేశారు. మంత్రి చొరవతో ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు (జీవో నం. 230) జారీ




చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు వర్తిస్తున్న 'తెలంగాణ లీవ్ రూల్స్ 1933' నిబంధనల ప్రకారమే, ఇకపై నిమ్స్ ఉద్యోగులు కూడా తమ ఆర్జిత సెలవులను సరెండర్ చేసి నగదు పొందవచ్చునని జీవోలో పేర్కొన్నారు. మంత్రిని కలిసిన సందర్భంగా ఉద్యోగ సంఘాల నాయకులు మాట్లాడుతూ.. తమ కష్టాన్ని గుర్తించి, ఎన్నో ఏళ్ల నిరీక్షణకు తెరదించినందుకు మంత్రికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ నిర్ణయం వల్ల వేలాది మంది నిమ్స్ ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ది చేకూరనుందని ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పేషెంట్లకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. పేషెంట్ల పట్ల చిరుబురులు ఆడొద్దని, సహనంతో సానుభూతితో వ్యవహరించాలన్నారు.

## యముడు వదిలినా..
# మేము వదలం : సజ్జనార్ వార్నింగ్



మద్యం మత్తులో వాహనం నడిపే వారిపై హైదరాబాద్ పోలీసుల కఠిన వైఖరి కొనసాగుతుందని హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్ స్పష్టం చేశారు. 'డ్రంక్ అండ్ డ్రైవ్' తనిఖీలను తప్పించుకునేందుకు సందుల్లోకి దూరి, ప్రమాదకర విన్యాసాలతో వాహనాలు నడపడం విజ్ఞత కాదని హెచ్చరించారు. ఈ నిర్లక్ష్యం వల్ల జరిగే ప్రమాదాల్లో ప్రాణాలు పోయేది ఎవరివో చెప్పలేమని ఆయన పేర్కొన్నారు. అది మీ ప్రాణమై ఉండొచ్చు లేదా ఎదుటివారి ప్రాణమై ఉండొచ్చని తెలిపారు. ఎవరు మరణించినా వారి కుటుంబాలకు మిగిలేది జీవితాంతం తీరని శోకమేనని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల క్షేమం కోసం పడే బాధను గుర్తుంచుకోవాలని, ఒక్క క్షణపు అజాగ్రత్తతో వారి జీవితాలను చీకట్లోకి నెట్టవద్దని సీపీ సజ్జనార్ సూచించారు. మద్యం మత్తులో వాహనం నడపడం అంటే మృత్యువును ఆహ్వానించడమేనని హెచ్చరించారు. ఒకవేళ యముడు క్షమించినా.. చట్టం మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టదని ఆయన తేల్చిచెప్పారు. ప్రజల ప్రాణాల విలువ పోలీసులకు తెలుసునని, అందుకే ఈ హెచ్చరిక చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా హైదరాబాద్ సీపీ సజ్జనార్ సందేశం విడుదల చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌పై జీరో టాలరెన్స్ విధానం అమలులో ఉంటుందని స్పష్టం చేశారు.

# శ్రీవారి సేవలో సీఎం రేవంత్ కుటుంబం..

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోమవారం రాత్రి తిరుమలకు వెళ్లారు. వైకుంఠ ఏకాదశి సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు మంగళవారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయానికి వచ్చిన ఆయనకు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. దర్శనానంతరం అర్చకులు తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనాలిచ్చారు. సీఎం సతీమణి, కూతురు, అల్లుడు,



మనుమడితో కలిసి తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి (శ్రీవారిని) వారిని దర్శించుకున్నారు. కాగా, ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పవిత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ముక్కోటి దేవతలతో కలిసి ఉత్తర ద్వార దర్శనమిచ్చే శ్రీమహావిష్ణువు దివ్యానుగ్రహం ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఇంట సుఖశాంతులు వెల్లివిరియాలని ఆకాంక్షించారు.

# అభిప్రాయ సేకరణ తర్వాతే రుషికొండ భవనాలపై తుది నిర్ణయం: ఎమ్మెల్యే గంటా

విశాఖ: రుషికొండ భవనాలపై ప్రభుత్వం ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ఆయన నివాసంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ''మ్యూజియం, ఆధ్యాత్మిక కేంద్రం, రిసార్ట్స్ తదితరాలకు ఈ భవనాలను ఇవ్వాలని వివిధ సంస్థలు ప్రతిపాదించాయి. ఏడాదిన్నరగా నిర్వహణ లేకపోవడం వల్ల.. భవనాలు పాడైపోతున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రత్యేక దృష్టి సారించారు. భాజపా ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు చెప్పినట్టు స్థానిక ప్రజా ప్రతినిధుల అభిప్రాయం తీసుకున్న తర్వాతే రుషికొండ భవనాలపై ప్రభుత్వ నిర్ణయం ఉంటుంది. సింహాచలం ప్రసాదంలో నత్త ఉందంటూ ఒక జంట సోషల్ మీడియాలో ట్రోల్ చేసిన విషయాన్ని సీరియస్‌గా తీసుకుంటాం. నిజం లేదని తేలితే వారిపై చర్యలు ఉంటాయి. ప్రసాదాల కౌంటర్ సిబ్బంది నొచ్చుకునేలా మాట్లాడారని ఆరోపణ



చేసిన జంట.. భక్తుల మనోభావాలు దెబ్బతినేలా వ్యవహరించడం సరికాదు'' అని వ్యాఖ్యానించారు.

**వైకాపాలో ఉన్నవారికి భవిష్యత్ లేదు**

వైకాపాలో ఉన్నవారికి ఎలాంటి భవిష్యత్ ఉండబోదని గంటా శ్రీనివాసరావు అన్నారు. ప్రభుత్వం చేసే మంచి పనులకు ఆ పార్టీ మద్దతు ఇవ్వకపోయినా పర్వాలేదు గాని దుష్ప్రచారం చేసి అడ్డుపడడం సరి కాదన్నారు. రప్పా.. రప్పా.. అంటూ మారణాయుధాలతో హల్ చల్ చేయడం, పుట్టినరోజు నాడు రక్తాభిషేకం చేయడం.. ప్రజలను భయాందోళనలకు గురి చేయడమేనని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ప్రజలకు ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు అమలు చేశామన్నారు. వైకాపా హయాంలో స్మశానంగా మార్చిన అమరావతిలో ఆంధ్రులు గర్వించే రాజధాని యుద్ధ ప్రాతిపదికన నిర్మితమవుతోందని చెప్పారు.

# రైల్‌వన్ యాప్‌లో ఈ టికెట్లపై 3% డిస్కౌంట్



దిల్లీ: రైల్‌వన్ యాప్‌లో టికెట్ల కొనుగోలుపై రైల్వే శాఖ ఆఫర్ ప్రకటించింది. ఈ యాప్ ద్వారా అన్‌రిజర్వుడు టికెట్లను ఏ డిజిటల్ పేమెంట్ మోడల్‌లో కొనుగోలు చేసినా 3శాతం డిస్కౌంట్ అందించనున్నట్లు తెలిపింది. 2026 జనవరి 14 నుంచి జులై 14 వరకు ఈ ఆఫర్ అందుబాటులో ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం రైల్‌వన్ యాప్‌లో ఆర్‌వాలెట్ ద్వారా చెల్లింపులు చేసిన వారికి ఈ క్యాష్‌బ్యాక్ లభిస్తోంది. దీన్ని అన్ని డిజిటల్ పేమెంట్లకూ విస్తరించారు. ఈ ఆఫర్‌కు అనుగుణంగా సాఫ్ట్‌వేర్ వ్యవస్థలో మార్పులు చేయాలని సెంటర్ ఫర్ రైల్వే ఇన్ఫర్మేషన్ సిస్టమ్ కు రైల్వే శాఖ సూచించింది. ఈ నిర్ణయంపై మే నెలలో ప్రయాణికుల నుంచి అభిప్రాయాలు సేకరించనున్నట్లు రైల్వే శాఖ తెలిపింది. ఆర్‌వాలెట్ ద్వారా కొనుగోళ్లపై క్యాష్‌బ్యాక్ యథాతథంగా కొనసాగుతుందని స్పష్టంచేసింది. ఇతర వేదికలపై కొనుగోలు చేసే అన్‌రిజర్వుడు టికెట్‌లకు ఈ ఆఫర్ వర్తించదని రైల్వే శాఖ స్పష్టంచేసింది. డిజిటల్‌గా టికెట్ల కొనుగోళ్లను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఏమిటీ రైల్‌వన్ యాప్?**

రైలు టికెట్ల బుకింగ్‌కో యాప్.. ప్లాట్‌ఫామ్ టికెట్లకు మరో యాప్.. జర్నీలో ఫుడ్ బుకింగ్‌కి ఇంకో యాప్.. ట్రైన్ లైవ్ ట్రాకింగ్‌కి, ప్రయాణంలో సాయానికి.. గత కొంతకాలంగా ఇలా ఒక్కో అవసరానికి ఒక్కో యాప్ అందుబాటులో ఉంది. వాటన్నింటినీ ఒక్క చోట అందించే ఉద్దేశంతో భారతీయ రైల్వే తీసుకొచ్చినదే ఈ రైల్‌వన్ యాప్. ఇందులో రిజర్వ్‌డ్, అన్‌రిజర్వ్‌డ్ టికెట్లతో పాటు ప్లాట్‌ఫామ్ టికెట్లను కూడా బుక్ చేసుకోవచ్చు. గూగుల్ ప్లేస్టోర్, యాపిల్ యాప్ స్టోర్ నుంచి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.



## 'సంస్కరణల ఎక్స్‌ప్రెస్'లో భారత్ ప్రయాణం : మోదీ 2025 రివైండ్

దిల్లీ: 2025 చివరకు వచ్చేసింది. ఇంకొన్ని గంటల్లో కొత్త సంవత్సరంలోకి అడుగుపెట్టబోతున్నాం. ఈ సందర్భంగా ఈ ఏడాది భారత ప్రభుత్వం తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ గుర్తుచేసుకున్నారు. ఇది సంస్కరణల సంవత్సరమని పేర్కొన్నారు. ఈ మేరకు ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ''సంస్కరణల ఎక్స్‌ప్రెస్‌లో భారత్ ప్రయాణం ప్రారంభించింది. ఈ ఏడాది వివిధ రంగాల్లో తీసుకొచ్చిన గణనీయమైన మార్పులు.. దేశాభివృద్ధికి మరింత ఊతమిచ్చాయి. వికసిత్ భారత్ నిర్మాణానికి ఇవి దోహదపడుతున్నాయి'' అని మోదీ తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. జీఎస్టీ సంస్కరణలు, బీమా రంగంలో 100శాతం ఎఫ్‌డీఐ, లేబర్ కోడ్‌లు, న్యూక్లియర్ ఎనర్జీ కోసం శాంతి చట్టం, 'వీబీ జీ రామ్ జీ' వంటి ఘటనలను ప్రధాని ఈ సందర్భంగా ఉదహరించారు. వస్తు సేవల పన్నులో రెండు శ్లాబులను తొలగిస్తూ కీలక సంస్కరణలు చేపట్టిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం 5శాతం, 18శాతం శ్లాబులను అమలు చేస్తున్నారు. దీని వల్ల కోట్లాది కుటుంబాలపై భారం తగ్గడమే గాక, గిరాకీ పెరిగిందని మోదీ గుర్తుచేశారు. ఇక, ఆదాయ పన్ను మినహాయింపు పరిమితిని రూ.12లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయం.. వేతన జీవులకు ఊరట కల్పించడంతో పాటు మార్కెట్లో వినిమయాన్ని పెంచిందని తెలిపారు.

## ఆకలితో వృద్ధుడి మృతి.. అస్థిపంజరంలా కుమార్తె!





ఓ రైల్వే విశ్రాంత ఉద్యోగి ఇంట్లో హృదయవిదారక ఘటన వెలుగు చూసింది. సంరక్షణ కోసం నియమించుకున్న ఓ జంట.. యజమాని, మానసిక వికలాంగురాలైన ఆయన కుమార్తె పట్ల అత్యంత దారుణంగా ప్రవర్తించింది. యజమాని ఇంట్లోనే ఉంటూ వారినే ఐదేళ్లుగా నిర్బంధించింది. ఈ క్రమంలో ఆ వృద్ధుడు చనిపోగా.. ఆయన కుమార్తె ఎముకల గూడుగా మారినట్లు తెలిసింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. యూపీలోని మహోబా జిల్లాకు చెందిన ఓం ప్రకాశ్ రాథోడ్ (70) రైల్వేలో సీనియర్ క్లర్క్‌గా పనిచేసి 2015లో పదవీ విరమణ చేశారు. మరుసటి ఏడాది ఆయన భార్య చనిపోగా.. మానసిక వికలాంగురాలైన కుమార్తె రష్మీతో మహోబాలో నివాసం ఉంటున్నారు. ఆయనకు వంట చేయడం రాకపోవడంతో, సంరక్షణ కోసం రాం ప్రకాశ్, రమాదేవి దంపతులను పనిలో పెట్టుకున్నారు. వారి పరిస్థితులను గమనించిన ఆ జంట.. యాజమాని, ఆయన కుమార్తెను గ్రౌండ్‌ఫ్లోర్‌లోని గదుల్లో నిర్బంధించింది. కుటుంబసభ్యులు, బంధువులు చూడడానికి వచ్చినప్పుడల్లా.. ఓం ప్రకాశ్ ఎవర్నీ కలిసేందుకు ఇష్టపడటం లేదని చెబుతూ తిప్పి పంపించేవాళ్లని సమాచారం.

**ఓం ప్రకాశ్ మరణంతో..**

తీవ్ర అనారోగ్యానికి గురైన ఓం ప్రకాశ్ ఇటీవల కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకొని ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు అక్కడి భయానక పరిస్థితులను చూసి షాక్‌కు గురయ్యారు. ఓం ప్రకాశ్ శరీరం కృశించిపోగా.. ఆయన కుమార్తె చీకటి గదిలో ఉన్నట్లు గుర్తించారు. ఎముకలగూడుగా మారిన రష్మీని చూసి షాక్‌కు గురయ్యారు. ఓం ప్రకాశ్ ఎప్పుడూ హుందాగా, సూట్‌లో కనిపించేవారని, ఇప్పుడు ఈ స్థితిలో చూసి జీర్ణించుకోలేకపోతున్నామని స్థానికులు చెప్పారు. ముప్పై ఏళ్ల రష్మీ 80 ఏళ్ల వృద్ధురాలిగా తయారైందని, కేవలం అస్థిపంజరం శ్వాస తీసుకుంటున్నట్లు కనిపిస్తోందని ఓం ప్రకాశ్ సోదరుడు వాపోయారు. డబ్బు, ఆస్తి కోసమే ఇలా చేశారని ఆరోపించారు. రంగంలోకి దిగిన పోలీసులు.. అన్ని కోణాల్లో విచారణ చేపట్టారు. ఆ ఇంటి విద్యుత్ కనెక్షన్‌ను సంరక్షకులు తమ పేరు మీదకు మార్పించుకున్నట్లు గుర్తించారు. ఊపిరితిత్తుల సమస్యతో ఓం ప్రకాశ్ చనిపోయినట్లు పోస్టుమార్టంలో తేలిందన్నారు. పూర్తి దర్యాప్తు అనంతరం నిందితులపై చర్యలు తీసుకుంటామన్నారు.

## అమిత్‌షా వ్యాఖ్యలను ఖండించిన మమతాబెనర్జీ





బెంగాల్‌పై కేంద్రమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో ఎన్నికలు దగ్గరపడుతుండడంతో బెంగాల్‌లో ఉగ్రవాద నెట్‌వర్క్‌లు విస్తరిస్తున్నాయని అమిత్ షా అన్నారని మమత పేర్కొన్నారు. ఉగ్రవాదులు ఇక్కడ ఉంటే పహల్గాం, దిల్లీలో ఉగ్రదాడులు చేసింది ఎవరని ప్రశ్నించారు. బెంగాల్ ప్రభుత్వం స్థలం ఇవ్వకపోవడం వల్లే సరిహద్దుల్లో కంచె నిర్మించలేకపోతున్నామని అమిత్ షా చేసిన వ్యాఖ్యలను మమత ఖండించారు. పెట్రాపోల్, చంగ్రబంధ సరిహద్దుల్లో ఇప్పటికే తమ ప్రభుత్వం భూమిని ఇచ్చిందన్నారు. తాము స్థలాన్ని ఇవ్వడం వల్లే రాష్ట్రంలో అన్ని రైల్వే ప్రాజెక్టులు వచ్చాయన్నారు. భాజపా నేతలు చెప్పే అబద్ధపు మాటలను బెంగాల్ ప్రజలు నమ్మరన్నారు. తమ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు రాష్ట్రంలో ఎన్నికలకు ముందు కేంద్రం 'ఎస్‌ఐఆర్' పేరుతో కుట్ర పన్నుతోందని వ్యాఖ్యానించారు. సర్ ప్రక్రియను ఇంత హడావిడిగా చేపట్టాల్సిన అవసరం ఏముందని కేంద్ర ప్రభుత్వాన్ని మమత ప్రశ్నించారు. ఎన్నికల కమిషన్ నుంచి వస్తున్న ఒత్తిడిని తట్టుకోలేక ఎందరో బీఎల్‌వోలు, అధికారులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణల్లో భాగంగా ఓటర్ల జాబితాలో 1.5 కోట్ల మంది పేర్లను తొలగించాలని చూస్తున్నారని ఆరోపించారు. ఇందులో రాష్ట్రంలోని ఆదివాసీలు, అణగారిన వర్గాలను లక్ష్యంగా చేసుకున్నారని ఆరోపించారు.



## ఆ కంటెంట్‌ను తొలగించండి : సోషల్ మీడియా సంస్థలకు కేంద్రం వార్నింగ్

ఆన్‌లైన్‌లో అశ్లీల, అభ్యంతరకర కంటెంట్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. పిల్లలపై లైంగిక వేధింపులు, అసభ్యకర, అశ్లీల కంటెంట్‌పై కఠినంగా వ్యవహరించాలని సామాజిక మాధ్యమాలు, ఇతర ఆన్‌లైన్ వేదికలకు స్పష్టం చేసింది. లేదంటే చట్టపరంగా తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ మేరకు ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వశాఖ అడ్వైజరీ జారీ చేసింది. అసభ్యకర, అశ్లీల, అనుచిత, చట్టవిరుద్ధ కంటెంట్‌పై సామాజిక మాధ్యమ వేదికలు కఠినంగా వ్యవహరించడం లేదని ఐటీ శాఖ పేర్కొంది. ఈ క్రమంలో ఐటీ చట్టంలోని సెక్షన్ 79 ప్రకారం థర్డ్‌పార్టీ సమాచారాన్ని ఆయా వేదికల్లో అప్‌లోడ్, ప్రచురణ, లేదా వ్యాప్తి చేస్తే.. అందుకు సామాజిక మాధ్యమ సంస్థలు సహా ఆయా ప్రచురణ వేదికలదే బాధ్యత అని గుర్తుచేస్తున్నట్లు అడ్వైజరీలో పేర్కొంది. నిబంధనలు పాటించకుంటే.. ఐటీ యాక్ట్, బీఎన్ఎస్ సహా ఇతర చట్టాల కింద ఆయా వేదికలు, సంబంధిత సంస్థలు, వినియోగదారులకు తీవ్ర పరిణామాలు తప్పవని ఉద్ఘాటించింది.

## బెంగాల్ సర్కార్ వల్లే సరిహద్దుల్లో కంచె వేయలేకపోతున్నాం



పశ్చిమ బెంగాల్‌లో భాజపా నిర్వహించిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ.. మమతా బెనర్జీ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వంపై మండిపడ్డారు. ఎన్నికల ప్రయోజనం కోసం టీఎంసీ పార్టీ బంగ్లాదేశీయుల చొరబాట్లను ప్రోత్సహిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన భూమిని ఇవ్వకపోవడం వల్లే భారత్ బంగ్లాదేశ్ సరిహద్దుల్లో కేంద్రం కంచె వేయలేకపోతోందని ఆరోపించారు. సరిహద్దుల్లో చొరబాట్లు కేవలం బెంగాల్‌కు సంబంధించిన సమస్య మాత్రమే కాదని.. మొత్తం దేశానికి సంబంధించిన సమస్యని అన్నారు. వీటివల్ల మన సంస్కృతీ సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కనుమరుగవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. 2026 ఎన్నికల్లో రాష్ట్రంలో భాజపానే అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వెంటనే సరిహద్దుల వద్ద చొరబాట్లను ఆపుతామని.. అక్రమ వలసదారులను బెంగాల్ నుంచి తరిమికొడతామని హామీ ఇచ్చారు. హింసాత్మక రాజకీయాలను సృష్టించడంలో వామపక్షాలను టీఎంసీ అధిగమించిందని అమిత్‌షాఅన్నారు. మమత పాలనలో రాష్ట్రంలో హింస, అవినీతి రాజ్యమేలాయని..ఆమె అవినీతి వల్లే 15 ఏళ్లుగా బెంగాల్ అభివృద్ధి కుంటుపడిందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు కూడా ఇక్కడి ప్రజలకు అందకుండా టీఎంసీ పార్టీ అడ్డుపడుతోందని ఆరోపించారు. ఆ పార్టీకి తగిన గుణపాఠం చెప్పాలంటే భాజపాను గెలిపించాలని ప్రజలను కోరారు. తాము అధికారంలోకి వస్తే బెంగాల్‌లో పరిశ్రమలు ఏర్పాటు చేసి, ఉద్యోగాలు కల్పిస్తామని.. రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపిస్తామని హామీ ఇచ్చారు.



## ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం.. పలువురి మృతి

ఉత్తరాఖండ్‌లో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. మంగళవారం తెల్లవారుజామున అల్మోరా జిల్లాలోని శిలాపానీ ప్రాంతంలో ప్రయాణికులతో వెళ్తున్న బస్సు ప్రమాదవశాత్తూ లోయలో పడిపోయింది. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందగా.. మరో 11 మంది పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయని పోలీసులు పేర్కొన్నారు. అయితే ప్రమాదం జరిగిన లోయ ప్రదేశం ఇబ్బందికరంగా ఉండడం, వాహనం కింద బురద పేరుకుపోవడంతో అందులో ఇరుక్కుపోయిన వారిని బయటకు తీయడం కష్టంగా మారిందన్నారు. స్థానికుల సహాయంతో క్షతగాత్రులను సమీపంలోని ఆస్పత్రికి తరలిస్తున్నట్లు తెలిపారు. బస్సు ద్వారహత్ మీదుగా రాంనగర్‌కు వెళ్తుండగా అదుపుతప్పి లోయలో పడినట్లు ప్రాథమిక దర్యాప్తులో గుర్తించామన్నారు.

## బెంజి కారులో మాదక ద్రవ్యాల అక్రమ రవాణా.. డ్రగ్స్ రాకెట్ పట్టివేత



ఎవరికీ అనుమానం రాకుండా లగ్జరీ కార్లలో హైబ్రిడ్ మాదక ద్రవ్యాలను అక్రమంగా రవాణా చేస్తున్న డ్రగ్స్ ముఠా గుట్టు రట్టయ్యింది. బెంజి కారులో డ్రగ్స్ అక్రమరవాణా చేస్తున్న రాకెట్‌ను అహ్మదాబాద్ పోలీసులు ఛేదించారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్ శివార్లలో ఓ కారు నుంచి రూ.15 లక్షల విలువైన హైబ్రిడ్ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. డ్రైవర్‌కు రూ.10వేలు చెల్లించి అతడి సహాయంతో కొనుగోలుదారుల వద్దకు డ్రగ్స్ తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. డిసెంబర్ 31న వివిధ ఫామ్‌హౌస్‌లలో నిర్వహించనున్న రేవ్ పార్టీల నిర్వాహకులకు ఈ మాదక ద్రవ్యాలు సరఫరా చేస్తున్నట్లు వెల్లడించారు. అర్పిత్ అగర్వాల్ అనే డ్రగ్స్ సరఫరాదారు థాయిలాండ్ నుంచి హైబ్రిడ్ గంజాయిని తీసుకువచ్చి.. ఎవరికీ అనుమానం రాకుండా ఉండటానికి తన లగ్జరీ కార్లలో వీటిని అహ్మదాబాద్‌లోని పలు ప్రాంతాలకు తరలిస్తుంటాడని పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో ఇద్దరిని అరెస్టు చేయగా.. ప్రధాన నిందితుడు అగర్వాల్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.

MOVIE TIME

# సిద్దూ జొన్నలగడ్డతో నాగవంశీ మరో మూవీ




**టాకీస్:** టాలీవుడ్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, స్టార్ బాయ్ సిద్ధు జొన్నలగడ్డతో మరో క్రేజీ ప్రాజెక్ట్‌ను పట్టాలెక్కించింది. వీరి కాంబినేషన్‌లో 'ప్రొడక్షన్ నెం. 40'గా రాబోతున్న ఈ సినిమాకు సంబంధించి అధికారిక ప్రకటన వెలువడింది. 'డీజే టిల్లు', 'టిల్లు స్క్వేర్' వంటి బ్లాక్ బస్టర్ల తర్వాత నిర్మాత సూర్యదేవర నాగవంశీ, సిద్ధు జొన్నలగడ్డ కలిసి పని చేస్తున్న సినిమా కావడంతో ఈ హ్యాట్రిక్ కాంబోపై ప్రేక్షకులు మరియు ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ' చిత్రంతో తన ప్రతిభను నిరూపించుకున్న స్వరూప్ ఆర్ ఎస్ జే ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. ఆయన మార్క్ స్క్రీన్ ప్లేకి, సిద్ధు ఎనర్జీ తోడైతే సినిమా సరికొత్తగా ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ మరియు ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్స్ పై అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ సినిమా రూపొందుతోంది. త్వరలోనే ఈ సినిమా టైటిల్ మరియు ఇతర నటీనటుల వివరాలను వెల్లడించనున్నారు. సిద్ధు ప్రస్తుతం వరుస సినిమాలతో బిజీగా ఉన్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్ కంటెంట్ చాలా వైవిధ్యంగా ఉండబోతోందని సమాచారం.



# ఒకే చోట 85,000 మంది..

## చరిత్ర సృష్టించిన విజయ్ 'జన నాయగన్' ఈవెంట్

**టాకీస్:** తమిళ చిత్ర పరిశ్రమలో 'దళపతి' విజయ్ క్రేజ్ మరోసారి ప్రపంచానికి తెలిసింది. ఆయన తన సినీ కెరీర్‌లో నటిస్తున్న చివరి చిత్రం కావడంతో 'జన నాయగన్'పై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మలేషియాలో నిర్వహించిన మూవీ ఆడియో లాంచ్ వేడుక మునుపెన్నడూ లేని విధంగా సరికొత్త చరిత్రను సృష్టించింది. మలేషియా రాజధాని కౌలాలంపూర్‌లోని ప్రసిద్ధ బుకిట్ జలీల్ నేషనల్ స్టేడియంలో డిసెంబర్ 27న జరిగిన ఈ వేడుకకు అభిమానులు పోటెత్తారు. దాదాపు 85,000 మందికి హాజరైనట్లు నిర్వాహకులు వెల్లడించారు. మలేషియా గడ్డపై ఒక భారతీయ సినిమా వేడుకకు ఈ స్థాయిలో జనం రావడం ఇదే మొదటిసారి. దీంతో ఈ ఈవెంట్ 'మలేషియా బుక్ ఆఫ్ రికార్డ్స్'లో చోటు సంపాదించి సరికొత్త రికార్డును నెలకొల్పింది. త్వరలో పూర్తిస్థాయి రాజకీయాల్లోకి ప్రవేశించనున్న నేపథ్యంలో విజయ్ చేసిన ప్రసంగం అభిమానులను ఉర్రూతలూగించింది.

హెచ్. వినోద్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో పూజా హెగ్డే హీరోయిన్‌గా నటిస్తోంది. బాబీ డియోల్, ప్రకాష్ రాజ్, ప్రియమణి వంటి భారీ తారాగణం ఉన్న ఈ సినిమా జనవరి 9, 2026న సంక్రాంతి కానుకగా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విజయ్ ఆఖరి సినిమా కావడంతో బాక్సాఫీస్ వద్ద ఈ చిత్రం భారీ వసూళ్లను రాబట్టడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

# తెలుగు సినిమాకు ఎప్పుడూ రుణపడి ఉంటా..

## మృణాల్ ఠాకూర్



టాకీస్: బుల్లితెర మీద చిన్న చిన్న సీరియల్స్ తీసి.. అలా అలా బాలీవుడ్ పలు చిత్రాలో సైడ్ క్యారెక్టర్లు చేసి ఇప్పుడు స్టార్ హీరోయిన్‌గా చక్రం తిప్పుతోంది మృణాల్ ఠాకూర్. ప్రజంట్ అటు బాలీవుడ్, ఇటు టాలీవుడ్‌లో సమానంగా అవకాశాలు అందుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటోంది. తెలుగులో 'సీతారామం' సినిమాలో సీతగా నటించి ప్రేక్షకుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించుకుంది. ఆ సినిమా ఆమె కెరీర్‌ను కొత్త మలుపు తిప్పింది అనడంలో సందేహం లేదు. ఆ తర్వాత నాని హీరోగా వచ్చిన 'హాయ్ నాన్న'తో తెలుగులో మరోసారి తన నటనకు మంచి మార్కులు వేయించుకుంది. మూడో సినిమా 'ఫ్యామిలీ స్టార్' ఆశించిన ఫలితం ఇవ్వకపోయినా, మృణాల్‌పై ఉన్న క్రేజ్ మాత్రం ఏమాత్రం తగ్గలేదు. ఇటీవల తన సినీ ప్రయాణం గురించి మాట్లాడుతూ మృణాల్ ఆసక్తికర విషయాలు వెల్లడించింది. నిజానికి తాను ఎప్పుడూ దక్షిణాది సినిమాల్లో నటిస్తానని అనుకోలేదని, అది తన జీవితంలో అనుకోకుండా దొరికిన అదృష్టమని చెప్పింది. 'సీతారామం' తర్వాత బాలీవుడ్‌లో తనను చూసే చూపే మారిపోయిందని, అందుకే తెలుగు సినిమాకు ఎప్పుడు రుణపడి ఉంటానని మృణాల్ తెలిపింది. ఇక త్వరలో 'డెకాయిట్' సినిమాతో మరోసారి టాలీవుడ్ ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా ప్రేక్షకులకు ఒక స్వీట్ షాక్‌లా ఉంటుందని, తన పాత్ర పూర్తిగా కొత్తగా, ఊహించని విధంగా ఉంటుందని మృణాల్ ధీమాగా వ్యాక్తం చేస్తోంది.

# చిరంజీవి కామెడీ టైమింగ్‌ను చూస్తారు

## 'మన శంకరవరప్రసాద్ గారు' పై అనిల్ రావిపూడి



టాకీస్: ఈ సంక్రాంతికి రానున్న 'మన శంకరవరప్రసాద్ గారు' ఆడియన్స్‌ను కచ్చితంగా అలరిస్తాడని దర్శకుడు అనిల్ రావిపూడి భరోసాగా ఉన్నారు. ఆయన దర్శకత్వంలో చిరంజీవి హీరోగా తెరకెక్కుతోన్న చిత్రమిది. జనవరి 12న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. దీని ప్రచారంలో భాగంగా మూడో పాటను రిలీజ్ చేయనున్నారు. గుంటూరులో ఈ సాంగ్ లాంచ్ ఈవెంట్ జరగనుంది. ఈసందర్భంగా ఏర్పాటుచేసిన ప్రెస్‌మీట్‌లో అనిల్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. చిరంజీవిలో ఉన్న కామెడీ టైమింగ్ మరోసారి తెరపై చూస్తారు. ఆయన ఈ చిత్రం కోసం ఎంతో శ్రమపడి లుక్ మార్చుకున్నారు. చూసినవారంతా చరణ్‌కు తమ్ముడా అని అడుగుతున్నారు. ఈ సినిమాకు ఆయన లుక్ అలా రావడం నా అదృష్టం. ఇండస్ట్రీకి చిరంజీవి, వెంకటేశ్, బాలకృష్ణ, నాగార్జున నాలుగు మూలస్తంభాలు. వీరిలో ఏ ఇద్దరు కలిసి నటించినా అది గొప్పగా ఉంటుంది. 'మన శంకరవరప్రసాద్ గారు'లో వెంకటేశ్, చిరంజీవి కలిసి సందడి చేస్తారు' అని చెప్పారు. సంక్రాంతి అంటేనే సినిమాల పండగ. ఈసారి 'రాజాసాబ్'తో సందడి మొదలవుతుంది. దానికోసం నేను కూడా ఎదురుచూస్తున్నా. వాళ్లు ప్రారంభించిన పండగ సందడిని మేం కొనసాగిస్తాం. సినిమాను ఆదరించాలా, లేదా అనేది ప్రేక్షకుల చేతుల్లోనే ఉంటుంది. రివ్యూలు వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే. వాళ్లను నేను ఎప్పుడూ తప్పు పట్టను. ప్రేక్షకులను అలరించడమే నా లక్ష్యం. తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఇప్పుడు ఫ్యాన్ వార్‌లు సాధారణం అయ్యాయి. ఏ హీరో సినిమా విడుదలైనా అవి జరుగుతూనే ఉంటాయి. అందుకే ట్రోల్ చేస్తుంటారు. వాటికి మనం స్పందించకుండా ఉంటే బాగుంటుంది.

# రోజూ వ్యాయామమే ఫిట్‌నెస్ రహస్యం

## వందో సినిమాపై నాగ్ ప్రత్యేక దృష్టి



టాకీస్: టాలీవుడ్‌లో ఎంతోమంది హీరోలు ఉన్నప్పటికీ గ్రీకువీరుడు, మన్మధుడు, కింగ్ అనగానే గుర్తొచ్చేది మాత్రం నాగార్జునే. 66 ఏళ్ల వయసులోనూ ఫిట్‌గా కనిపిస్తూ యంగ్ హీరోలకు పోటీనిస్తుంటారు. తాజాగా ఆయన ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన ఫిట్‌నెస్ సీక్రెట్ పంచుకున్నారు. తాను ఎప్పుడూ కడుపు మాడ్చుకొని డైటింగ్ చేయలేదు. వేళకు తింటాను. దానితో పాటు రోజూ కచ్చితంగా ఉదయం వ్యాయామం చేస్తాను. ఇప్పటికి 45 ఏళ్లుగా నేను జిమ్ చేస్తున్నాను. ఏరోజూ కూడా మిస్ అవలేదు. ఎప్పుడైనా ఆరోగ్యం బాలేక.. వెళ్లలేని పరిస్థితుల్లో ఉంటే తప్ప మిగతా రోజుల్లో కచ్చితంగా జిమ్‌కు వెళ్తా. అన్నిటికంటే ముఖ్యంగా నేను ఏ విషయాన్నైనా పాజిటివ్‌గా తీసుకుంటాను. ఎలాంటి సమస్య అయినా నన్ను నేను నిరుత్సాహపరుచుకోను అని చెప్పారు. ఇక 2025 గురించి నాగార్జున మాట్లాడుతూ తాను ఈ ఏడాది ఎంతో ఆనందంగా ఉన్నట్లు తెలిపారు. కెరీర్ పరంగానే కాకుండా పర్సనల్‌గానూ చాలా సంతోషంగా ఉన్నానన్నారు. ఇంతకుమించి తానేం కోరుకోవడం లేదన్నారు. ఈ సంవత్సరం అఖిల్ వివాహ బంధంలోకి అడుగుపెట్టారని.. అలాగే నాగచైతన్య-శోభిత ఒక్కటై ఏడాది పూర్తయిందన్నారు. వాళ్లను చూస్తుంటే ఎంతో ఆనందంగా ఉందన్నారు. నాగార్జున కెరీర్ విషయానికొస్తే.. ఈ ఏడాదిలో ఆయన రెండు సినిమాల్లో కనిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో వచ్చిన 'కూలీ'లో ఆయన నటించిన సైమన్ పాత్రకు మంచి ఆదరణ సొంతమైంది. అలాగే కుబేరలో మాజీ సీబీఐ అధికారి దీపక్‌తేజ్‌గా కనిపించి మెప్పించారు.

# దశాబ్ద కాలం నిరీక్షణకు తెర.. ఎట్టకేలకు హిట్టు కొట్టిన 'ప్రేమమ్' హీరో నివిన్ పాలీ!




**టాకీస్:** మలయాళ స్టార్ నటుడు నివిన్ పాలీ గత కొన్ని ఏండ్లుగా హిట్టు లేక సతమతమవుతున్న విషయం తెలిసిందే. 'ప్రేమమ్' సినిమాతో మలయాళ చిత్ర పరిశ్రమనే కాకుండా ఇండియన్ సినిమా ఇండస్ట్రీని తనవైపు తిప్పుకున్న ఈ స్టార్ హీరో ఆ తర్వాత ఒక్క విజయం కూడా అందుకోలేకపోయాడు. ఆ మధ్యలో వచ్చిన యాక్షన్ హీరో బిజు కొంచెం ఉపశమనం అందించిన ఆశించిన స్థాయిలో విజయం రాలేదు. ఇక చాలా ఏండ్లుగా హిట్టు కోసం చూస్తున్న నివిన్‌కి తాజాగా బ్లాక్ బస్టర్ దక్కినట్లు తెలుస్తుంది. అతడు ప్రధాన పాత్రలో నటించిన 'సర్వం మాయా' చిత్రం తాజాగా విడుదలై బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తుంది. హారర్ కామెడీ నేపథ్యంలో వచ్చిన ఈ చిత్రం కేవలం 5 రోజుల్లోనే రూ. 50 కోట్ల క్లబ్లో చేరి సంచలనం సృష్టించింది. ఈ సినిమాకు విదేశాల్లో, ముఖ్యంగా గల్ఫ్ దేశాలలో ఊహించని స్థాయిలో రెస్పాన్స్ వస్తోంది.

# మిక్స్‌డ్ టాక్ నుంచి స్టడీ కలెక్షన్స్

## బాక్సాఫీస్ వద్ద నిలదొక్కుకుంటున్న 'ఛాంపియన్'

టాకీస్: ఐదు రోజుల క్రితం థియేటర్లలో విడుదలైన 'ఛాంపియన్' సినిమాకు మొదటిరోజు నుంచి ఆహా, ఓహో అనే స్థాయి టాక్ రాలేదు. అయితే "ఓ సారి హ్యాపీగా చూసేయొచ్చు" అనే డీసెంట్ స్పందనతోనే సినిమా ప్రయాణం మొదలైంది. టాక్ ఎలా ఉన్నా, బాక్సాఫీస్ వద్ద మాత్రం ఈ సినిమా తన సత్తా చాటుతోంది. విడుదలైన కొద్ది రోజులలోనే స్టడీ కలెక్షన్లతో వీర విహారం చేస్తూ ట్రేడ్ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. నిజానికి ఈ సినిమాపై ముందు నుంచే ప్రేక్షకుల్లో మంచి క్యూరియాసిటీ క్రియేట్ అయింది. అందుకు




ప్రధాన కారణం స్వప్న సినిమాస్ బ్యానర్. 'మహానటి', 'జాతిరత్నాలు', 'సీతారామం' వంటి కల్ట్ చిత్రాలు అందించిన ఈ ప్రొడక్షన్ హౌజ్ నుంచి వస్తున్న సినిమా కావడంతోనే మొదటి నుంచే సాలిడ్ అంచనాలు ఏర్పడ్డాయి. దీనికి తోడు టీజర్, ట్రైలర్‌లు కూడా సినిమాపై ఆసక్తిని మరింత పెంచాయి. రిలీజ్ రోజున మిక్స్‌డ్ టాక్ వచ్చినప్పటికీ, ఆ తర్వాత పరిస్థితి క్రమంగా మారింది.

# బ్యాటిల్ ఆఫ్ గల్వాన్ మూవీపై చైనా అక్కసు




**టాకీస్:** బాలీవుడ్ అగ్ర నటుడు సల్మాన్‌ఖాన్ ప్రధాన పాత్రలో నటిస్తోన్న చిత్రం 'బ్యాటిల్ ఆఫ్ గల్వాన్'. ఇటీవల సల్మాన్ పుట్టినరోజును పురస్కరించుకుని ఈ సినిమా టీజర్‌ను విడుదల చేయగా.. ప్రపంచవ్యాప్తంగా విశేష ఆదరణ లభించింది. తెలంగాణకు చెందిన కర్నల్ బిక్కుమల్ల సంతోష్‌బాబుతో పాటు 20 మంది మన సైనికులు వీరమరణం పొందారు. ఇదే ఈ కథకు మూలంగా తెలుస్తోంది. అయితే, దీనిపై తాజాగా చైనా అధికారిక మీడియా 'గ్లోబల్ టైమ్స్' అక్కసు వెళ్లగక్కింది. చైనాపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు చరిత్రను వక్రీకరిస్తున్నారంటూ నోరుపారేసుకుంది. ఈ మేరకు తమ సంపాదకీయంలో భారత సినిమాపై తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ చిత్రం జాతీయవాద మెలోడ్రామా అని చైనా ఆరోపించింది. గల్వాన్‌లో ఘర్షణలకు భారత బలగాలే కారణమంటూ తమ దేశాన్ని సమర్థించుకునే ప్రయత్నం చేసింది. భారత దళాలు అక్రమంగా తమ భూభాగంలోకి చొరబడి.. చైనా సైనికులపై దాడి చేశాయంటూ అసత్యాలు వల్లెవేసింది. తమ దేశానికి చెడ్డపేరు తెచ్చేందుకు భారత్ వాస్తవాలను వక్రీకరించి అంతర్జాతీయ సమాజాన్ని తప్పుదోవ పట్టించిందంటూ బూటకపు వ్యాఖ్యలు చేసింది.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.